ప్రజాశక్తి

గురువారం 12 జూన్ 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

బ్యారేజీల నిర్మాణం అటకెక్కింది

నిధుల లేమితో ముందుకు సాగని ప్రాజెక్టులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పలు ప్రాజెక్టులు, పథకాలకు నిధులు కేటాయింపు జరక్కపోవడంతో అవి ముందుకు సాగడంలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను టిడిపి కూటమి నేతలు విస్మరించడంతో ఎక్కడి పనులు అక్కడే ఉండిపోతున్నాయి. ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణానదిపై మరో రెండు బ్యారేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు పంటలు ముంపునకు గురికాకుండా చేసేందుకు పలు డ్రెయిన్లపై అవుట్‌ఫాల్ స్లూయిజ్ల నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీ కూడా అమలు కావడంలేదు. కృష్ణాడెల్టా ఆధునీకరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణానదిపై కృష్ణాజిల్లా చోడవరం, బండికోళ్లలంక వద్ద రెండు బ్యారేజీల నిర్మాణానికి గతంలో రూ.4,300 కోట్లతో అంచనాలు రూపొందించారు. కృష్ణానదికి 15 లక్షల క్యూసెక్కుల వరకు వరద ఉధృతి వచ్చినా తట్టుకునేలా ఈ బ్యారేజీల డిజైన్లను రూపొందించారు. అసంపూర్తిగా ఉన్న డెల్టా ఆధునీకరణ పనులకు రూ.600 కోట్లు అవసరమని అంచనా వేశారు. అయితే ఈ రెండు కీలక ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. దీంతో ఇవి ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడమే ఇందుకు కారణంగా ఉంది. బుడమేరు పరీవాహక ప్రాంతాలను ముంపు బారినుండి రక్షించేందుకు కరకట్టలను పటిష్టపరచాల్సి ఉంది. ఈ క్రమంలోనే కృష్ణా డెల్టా తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో సాగునీటి కాల్వలు, డ్రయినేజీల పనులకు రూ.300 కోట్లే కేటాయించడంతో పనులు అరకొరగానే సాగుతున్నాయి. గన్నవరం విమానాశ్రయ విస్తరణకు గతంలో ప్రభుత్వం భూ సమీకరణ జరిపింది. రైతులు, నిర్వాసితులకు కౌలు చెల్లింపులు, వారికి కేటాయించిన ప్లాట్ల అభివృద్ధికి కొద్దిమేర నిధులు కేటాయించడంతో బాధితులందరికీ న్యాయం జరగలేదు. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు డిటైల్ ప్రాజెక్టు (డిపిఆర్) పూర్తి చేసి కేంద్రానికి పంపారు. గన్నవరం - విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (మిగతా 2లో)

ప్రపంచ రికార్డులకు వేదికగా బెరం పార్క్

వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగాలో ఎంపి కేశినేని

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : భవానీపురం బెరం పార్కు, పున్నమి ఘాట్ వద్ద నదీతీరం వివిధ ప్రపంచ రికార్డులకు వేదికగా నిలిచిందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. భవానీపురంలోని బెరంపార్కు వద్ద నదిలో బుధవారం వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగా మెగా ఈవెంట్ నిర్వహించారు. ఓ నదిలో అత్యధిక మందితో వివిధ రకాల అత్యధిక బోట్లపై (మిగతా 2లో)

అర్థవంతమైన చర్చ జరగాలి

- సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి
- విఎంసి కౌన్సిల్ అజెండాపై కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజాస్వామ్య పద్ధతిలో అర్థవంతమైన చర్చ ద్వారా ప్రజా సమస్యల పరిష్కార వేదికగా కౌన్సిల్‌ను నిర్వహించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అన్నారు. ఈ నెల 13న జరుగుతున్న విఎంసి సాధారణ కౌన్సిల్ సమావేశం అజెండా అంశాలపై స్థానిక శ్రీశ్రీ భవన్‌లో ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబుతో కలిసి కాశీనాథ్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. అజెండా అంశాలపై ప్రతి సభ్యుడు మాట్లాడటానికి వీలుగా అవకాశం కల్పించాలని కోరారు. నగర ప్రజలపై భారాలు మోపుతూ తీసుకునే ప్రజావ్యతిరేక నిర్ణయాలపై అటు కౌన్సిల్ లోపల, వెలుపుల ప్రజల తరుపున సిపిఎం పోరాడుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులకు ఆదాయ వనరుగా మారిన ఫుడ్ స్ట్రీట్, విఎంసి జనరల్ నిధుల నుంచి రూ. కోటి 95 లక్షల అంచనా వ్యయంతో సర్కిల్-3లోని కొత్త ప్రభుత్వ

మాట్లాడుతున్న కాశీనాథ్, సత్యబాబు

వైద్యశాల వద్ద మరో ఫుడ్ స్ట్రీట్‌ను ఏర్పాటు చేయాలని అజెండాలో నాల్గో అంశం తీసుకొచ్చారని, దీని ఏర్పాటుకు స్థలం ఎక్కడ, దానిని ఎవరు నిర్వహిస్తారనేది తెలియజేయలేదన్నారు. ఈ అంశాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. అడ్వర్‌టైజ్‌మెంట్ హోర్డింగ్‌లు, బోర్డుల ప్రకటనల పన్ను వసూలు దాని రాబడి, ఏజెన్సీల మధ్య వివాదాలు నడుస్తున్నాయని, ఇటువంటి సమస్యలపై మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్, విఎంసి లీగల్ సెల్ సత్వరమే జోక్యం చేసుకొని పరిష్కరించాల్సి ఉందన్నారు. (మిగతా 2లో)

నేటి నుండి బడులు

- పాఠశాలల్లో ఎక్కడి సమస్యలు అక్కడే
- పూర్తికాని ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ
- అమలు కాని 'తల్లికి వందనం'

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

నెల రోజులు వేసవి సెలవుల అనంతరం నేటి నుంచి బడులు తిరిగి తెరుచుకోనున్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ జరగలేదు... ఉన్న ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి కాలేదు... మౌలిక సదుపాయాల కల్పనకు గత ప్రభుత్వ హయాంలో నాడు నేడు పథకం కింద పాఠశాలల్లో ప్రారంభించిన పనులు పూర్తి కాలేదు... పాఠశాలలు తెరిచే నాటికి తల్లికి వందనం పథకం అమలు చేస్తామన్న హామీ అమలు కాలేదు... ఇలా ఇన్ని సమస్యల మధ్య పాఠశాలలు గురువారం నుండి పునఃప్రారంభం కానున్నాయి. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తి స్థాయిలో పాఠశాలల్ని సర్వం సిద్ధం చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ దిశగా మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. దీంతో ఎక్కువ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు పూర్తిస్థాయిలో సమకూరలేదు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇంకా కొన్ని రోజుల పాటు సమస్యలతో సహవాసం చేయక తప్పేటట్లు కనబడటంలేదు. ప్రభుత్వం చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉండటం లేదు. పాఠశాలలు పూర్తి స్థాయిలో సిద్ధం కాలేదనే విమర్శలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వినబడుతున్నాయి.

కృష్ణాజిల్లాలో 1,791 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 1,111, ప్రాథమికోన్నత 256, ఉన్నత పాఠశాలలు 34 ఉన్నాయి. ఈ పాఠశాలల పరిధిలో మొత్తం 10,445 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల (మిగతా 2లో)

ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో ట్రాక్టర్ నడుపుతున్న కలెక్టర్

వార్త 8లో

పలుచోట్ల ఏరువాక పౌర్ణమి

విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లు వద్దు

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-గుడివాడ: విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని ప్రభుత్వం మానుకోవాలని, ప్రజలపై వేసిన విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సామాన్యులకు పెనుభారంగా మారనున్న విద్యుత్ స్మార్ట్‌మీటర్లపై బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ సెకీ ఒప్పందంలో అవినీతి జరిగిందని, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి 1750 కోట్ల రూపాయలు ముడుపులు అదానీ కంపెనీ నుండి అందాయని అమెరికా ఫెడరల్ కోర్టులో కేసు నమోదు విచారణ జరుగుతున్నప్పటికీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలపై పెను భారాలు మోపే విద్యుత్తు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని తక్షణమే నిలిపివేయాలన్నారు. అలాగే ఇప్పటికే బిగించిన

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి నరసింహారావు

మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. డే ఆఫ్ టైం పద్ధతిలో గంటకు ఒక రేటును నిర్ణయించి విద్యుత్ ఛార్జీలు వసూలు చేసే విధానం వద్దని, ప్రజలను పీడించే ప్రీపెయిడ్ మీటర్లు నష్టదాయకమని అన్నారు. ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రైవేటు కంపెనీలకు దోచిపెట్టేందుకు ప్రజలపై భారాలు మోపుతుందని విమర్శించారు. ప్రభుత్వం అదానీ కంపెనీతో కుమ్మక్కై రాష్ట్రాన్ని (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

నేటి నుండి బడులు

మౌలిక వసతుల కల్పనకు గత వైసిపి ప్రభుత్వం నాడు నేడు పథకం కింద పనులు ప్రారంభించింది. మొదటి ఫేజ్‌లో ప్రారంభించిన పనులు పూర్తయ్యాయి. రెండో ఫేజ్‌లో పనులు ప్రారంభించడం తదుపరి ఎన్నికలు రావడం అనంతరం ప్రభుత్వం మారడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో పాఠశాలల్లో పనులు అసంతృప్తిగా మిగిలిపోయాయి. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు నిలిపివేయడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. దీనివల్ల ఇప్పటికే ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పాఠశాల పున:ప్రారంభం నాటికి విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో తీసుకొస్తామని అందులో భాగంగానే మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు చేపడతామని ప్రకటించారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా టీచర్ల భర్తీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. కృష్ణాజిల్లాలో 1208 ఖాళీలను గుర్తించారు. ఈ ఖాళీలను డిఎస్‌సిలో భర్తీ చేయడానికి ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. అలాగే తల్లికి వందనం పథకం ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున అందిస్తామని చెప్పారు. వీటిని కూడా ఇప్పటివరకు జమ చేయలేదు. గురువారం జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ చివరి దశలో ఏదో ఒక సాకు చూపి నిలిపివేయచ్చనే సందేహం విద్యార్థుల తల్లిదండ్రుల్లో నెలకొంది. అలాగే ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ప్రక్రియ కూడా పూర్తి చేస్తామని విద్యాశాఖ మంత్రి ప్రకటించినప్పటికీ ఈ ప్రక్రియ కూడా పూర్తికాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించి పాఠశాలలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అర్థవంతమైన చర్చ జరగాలి

ఆస్తి పన్ను పెంపు 20 శాతం తగ్గకుండా ఆపైన 100 శాతం వరకు పెంచాలని ప్రభుత్వం జారీ చేసిన మెమో ప్రకారం విఎంసి సర్వే చేస్తుందని, దీని ప్రకారం సుమారు రూ.80 కోట్ల వరకు ప్రజలపై ఆస్తి పన్ను భారాలు మోపాలనే దిశగా అధికారులు చేస్తున్న కసరత్తులను విరమించుకోవాలన్నారు. ఇప్పటి వరకు పన్నులు వేయని మురికివాడల్లోని ఇళ్లకు పన్నులు వేసి వాటిని క్రమబద్దీకరించాలని కోరారు. సరైన డ్రెయినేజీ సదుపాయం లేక, మ్యాన్ హోల్స్ పొంగిపొర్లుతూ చిన్నపాటి వర్షాలకే నగరం తటాకంగా తయారవుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికయినా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచి, నగర వ్యాప్తంగా సిల్టు తొలగించాలని కోరారు. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం గృహాలను అర్హులకు కేటాయించాలని కోరారు. అలాగే రూ.19 కోట్లు చెల్లించిన 6,576 మంది లబ్దిదారులకు టిడ్కో గృహాలు పంపిణీ చేయలేదని, అవి కూడా దెబ్బతింటున్నాయని అన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా రూ.21 వేల నుంచి 24,500 వరకు విఎంసిలోని ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. విద్యుత్ వినియోగదారులకు ఉరితాళ్లుగా తయారయ్యే స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మృతిచెందిన, 60 ఏళ్ల నిండాయనే సాకుతో తొలగించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు పారిశుధ్య కార్మికులుగా అవకాశం కల్పించాలని కోరారు. 2021 నుంచి నేటి వరకు చేసిన 57 తీర్మానాల్లో ఏ ఒక్కటీ కూడా ఇప్పటికీ అమలు జరగలేదని అన్నారు. దీనిపై సిపిఎం కౌన్సిల్లో నిలదీస్తుందన్నారు. సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార దిశగా కౌన్సిల్‌ను నిర్వహించాలని కోరారు. ఆస్తి పన్ను పెంపుకు జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు. దీనిపై సిపిఎం ఇప్పటికే మేయర్‌కు వినతిపత్రం అందజేసిందని, వైసిపి, టిడిపి మద్దతు తెలపాలని కోరారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై కౌన్సిల్లో పోరాడతామని చెప్పారు.

బ్యారేజీల నిర్మాణం అటకెక్కింది

(పిఎన్‌బిఎస్), పెనమలూరు - విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ రూట్లలో 91 ఎకరాల మేర భూ సేకరణ చేస్తామని అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రకటించింది. అత్యంత ఖరీదైన మెట్రో కారిడార్ల ప్రాంతంలో భూ సేకరణకే రూ.200 కోట్లకుపైగా అవసరం అవసరమవుతాయని అంచనా. కానీ కేవలం రూ.50 కోట్లే కేటాయించడంతో పనులు వేగం అందుకోవడంలేదు.

సహకార విలువలపై అవగాహన అవసరం

రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ సురేశ్‌కుమార్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: జాతీయోద్యమంతో సమంగా ఆనాడు దేశంలో బలంగా సాగిన సహకారోద్యమం అనేక కారణాల వల్ల క్రమేణా బలహీనపడిందని, దీన్ని పునర్జీవింపజేసేలా సమాజంలోని అన్ని వర్గాల చెంతకు చేర్చితే సహకారం భూమి స్థాపిత లక్ష్యం చరితార్థమౌతుందని సి.రాఘవాచారి మీడియా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్ సూచించారు. సహకార భావన నేటి యువతరానికి తెలిసేలా, వారిని ప్రభావితం చేసేలా విస్తృత ప్రచారం జరగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సహకార భూమి పక్ష పత్రిక రెండేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా 48వ సంచికను సురేశ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్, సంఘం డైరెక్టర్ చావా రవి అధ్యక్షతన సహకారభూమి సహకార సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. మానవుడి ఆవిర్భావంతోనే సహకారం మొదలైందని, మనిషి కుటుంబం నుంచి సామాజిక జీవనం వరకూ సహకారంలో భాగమేనని సురేశ్ కుమార్ అన్నారు. పదిమంది కలిసి ఏదైనా ఒక లక్ష్యాన్ని చేరటమనేదే సహకారమనే విషయంపై యువతలో అవగాహన కల్పించి, సహకార విలువలను వారిలో పెంచే ప్రయత్నం జరగాలన్నారు. దేశంలో ఉదారవాద విధానాలు అమల్లోకి వచ్చాక సహకార రంగానికి ఆదరణ తగ్గిందన్నారు. రాజకీయ పార్టీల అనుబంధ సంఘాలుగా కార్మికవర్గం సంఘటితంగా ఉన్నంత కాలం సహకార భావన కూడా బలంగా ఉంటుందన్నారు. తొలుత సహకారభూమి జర్నల్ సహకార సంఘం వ్యవస్థాపక సభ్యులు కొమ్మాలపాటి శరత్చంద్ర జ్యోతిశ్రీ సభకు స్వాగతం పలికారు. సంఘం అధ్యక్షులు, పత్రిక గౌరవ సంపాదకులు దాసరి కేశవులు, ఎడిటర్ అక్బర్ పాషా, సంపాదకవర్గ సభ్యులు కృష్ణ కానూరి, డి.స్వాతి, నాగార్జున, న్యాయ సలహాదారు మల్లెల శేషగిరిరావు, సభ్యులు టి.వి.నరసింహారావు, వై.దయానంద్, సహకారవాదులు జి.ఎస్.చక్రవర్తి, బి.సాంబిరెడ్డి, సాంబశివరావు, పీపుల్స్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రతినిధులు ఎ.రామ్ జీ, జి.పరశురామ్ పాల్గొన్నారు. సహకారభూమి సహకార సంఘం కార్యదర్శి వీరమాచనేని రత్నప్రసాద్ వందన సమర్పణ చేశారు.

సహకారభూమి పక్షపత్రిక 48వ సంచికను ఆవిష్కరిస్తున్న సురేశ్‌కుమార్

ప్రపంచ రికార్డులకు వేదికగా బెరం పార్కు

యోగాసనాలు వేయడం ద్వారా ఈ ఈవెంట్ ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. పంట్లు, బోట్లు, స్పీడ్ బోట్లు, కయాక్స్ బోట్లు, శాండ్ బోట్లు, జెట్ స్కీ, లైఫ్ బోట్లు వంటి 201 వాటర్ క్రాఫ్టులపై వెయ్యిమంది, నదీ తీర ప్రాంతంలో ఏర్పాటుచేసిన పచ్చని తివాచీలపై మరో వెయ్యి మంది యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపి కేశినేని శివనాథ్, రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, జీఎడీ-పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశినేని మాట్లాడుతూ నగర ప్రజల నిబద్ధత ఫలితమే నేటి ప్రపంచ రికార్డు అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ, ప్రజల సమష్టి కషితో రికార్డు సొంతమైందన్నారు. నదీతీరం గతంలోనూ వివిధ ప్రపంచ రికార్డులకు వేదికగా నిలిచిందన్నారు. 5 వేల డ్రోన్లతో మెగా డ్రోన్ షోతో ప్రపంచ రికార్డులు సాధించినట్లు తెలిపారు. అజయ్ జైన్ మాట్లాడుతూ ఐక్యతకు, సమష్టి కషికి ప్రతీక ప్రపంచ రికార్డు అన్నారు. ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ యోగాసనాల కార్యక్రమం ప్రపంచ రికార్డు సాధించినందుకు గర్వపడుతున్నట్లు చెప్పారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ టీమ్ ఎన్‌టిఆర్ స్ఫూర్తితో ప్రపంచ రికార్డు సాధించడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఇది జిల్లా అధికారులు, సిబ్బంది, యోగా ఔత్సాహికులు, ప్రజలు ప్రతిఒక్కరికీ దక్కినట్లు తాను భావిస్తున్నానన్నారు. అమరావతి బోటింగ్ క్లబ్, ఏపీటీడీసీ, అమరావతి యోగా అండ్ ఏరోబిక్ అసోసియేషన్, ఈషా ఫౌండేషన్, టూరిజం తదితర విభాగాలు ఏర్పాట్లను సమన్వయపరిచాయి. ఈ కార్యక్రమంలో వరల్డ్ రికార్డ్స్ యూనియన్ (డబ్ల్యూఆర్‌యూ) న్యాయనిర్ణేత షరీఫ్ హనిఫ్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, అమరావతి బోటింగ్ క్లబ్ (ఎబీసీ) సీఈవో తరుణ్ కాకాని, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, ఆయుష్ అధికారులు డాక్టర్ వి.రాణి, డాక్టర్ రామతులసి, డా. రత్నప్రియదర్శిని, జిల్లా అధికారులు డా. ఎం.సుహాసిని, ఎ.శిల్ప, జి.జ్యోతి, డాక్టర్ జె.సుమన్, పి.లావణ్య కుమారి, ఏఎన్‌వీ నాంచారరావు, ఎ.రాము, వి.పెద్దిబాబు, తహసీల్దార్లు ఇంతియాజ్ పాషా, రోహిణి దేవి, సుగుణ కుమారి, సూర్యారావు పాల్గొన్నారు.

పదవ తరగతి సర్టిఫికెట్ పోయినది

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ గ్రామ వాస్తవ్యులు కొర్లకర్ల సరళాదేవి, తండ్రి ఆంజనేయ శర్మ సంబంధించిన పదవ తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్ పోయినది. సర్టిఫికెట్ నెం. 018601,రోల్ నెం. 054915. జిరాక్స్ నిమిత్తము ఇంటి నుండి గాంధీ సెంటర్ కు స్కూటీ పై వెళ్లుచుండగా మార్గమధ్యలో సర్టిఫికెట్ జారి పోయినది. సదరు ఒరిజినల్ పదవ తరగతి సర్టిఫికెట్ దొరికిన వారు సెల్. 98480 46535కి ఫోన్ చేసి ఇవ్వగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

ఓ.డి. సర్టిఫికెట్లు పోయినవి

గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన నంబూరు దాసు S/o అయ్యవార్లు 8-5-2025 తేదీన వీరులపాడు గ్రామానికి బైక్‌పై వస్తుండగా నా దగ్గర నా బ్యాగులో ఉన్న డిగ్రీ ఓ.డి ఒరిజినల్ సర్టిఫికెట్లు చట్టనపరం మరియు చౌటపల్లి గ్రామ సమీపంలోనే జారిపడి పోయినవి. **ఓడి సర్టిఫికెట్ నెంబరు 016002** సర్టిఫికెట్ నెంబరు రోల్ నెంబర్ 19711 35084 మరియు తేదీ 02-03-2015 గల సర్టిఫికెట్లు పోయినవి. ఎవరికైనా దొరికినచో ఈక్రింది ఫోన్ నెంబర్‌కు తెలపగలరు.

నంబూరు దాసు
9381575957

విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లు వద్దు

దోచుకోవడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ప్రజలకు పెనుభారంగా మారే స్మార్ట్ మీటర్లను ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల విషయంలో బిజెపి, జనసేన, టిడిపి, వైసిపిలు ఒకే వైఖరి అవలంభిస్తున్నాయని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, ఎఐటియుసి పట్టణ నాయకులు చింతలూరి సత్యనారాయణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.కొండా, ఎం నారాయణ, సిఐటియు పట్టణ కార్యదర్శి సిహెచ్.శివ, ఐద్వా పట్టణ కార్యదర్శి పి.రజని, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు యస్.సమరం, సాహితీ స్రవంతి అధ్యక్షులు యల్.సురేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్డ్ ఎంప్లాయీస్ ఉపాధ్యక్షులు కె రామకృష్ణ, మోటూరు వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు ఇమ్మడి అశోక్ కుమార్, పట్టణ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లంకపల్లి లాజర్, రిటైర్డ్ టీచర్ రామకృష్ణ, ఆటోనగర్ నాయకులు కమ్మిలి పావనరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలోని గౌరవనీయఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాలపరిష్కార కమిషన్ ముందు
I.A.No.1414/2024 in A/743/2024

మధ్య:
యూనివర్సల్ సోంపో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ... అప్పీలుదారు
మరియు
బయన నంద కిషోర్ రాఘవ సత్య మరియు మరో 2 మంది ... ప్రతివాదులు

టు:
బయన నంద కిషోర్ రాఘవ సత్య కుమారుడు అయినా నారాయణరావు, నివాసి: డోర్ నంబర్ 74-12-41, వెంగమూడి వారి వీధి, సాయి సూర్య విల్లా, 2వ అంతస్తు, విద్యుత్ కాలనీ, 8వ లేన్, పటమట, విజయవాడ - 520010.

పైన నెంబర్ పిటిషన్ లో గల ఒకటవ ప్రతివాది అయినా మీరు పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ వారి ద్వారా నోటీసు పంపించమని మీకు ముట్టనందున మీకు ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ వారు ఆర్డర్ వేస్తూ ది.23.06.2025 వ తేదీన వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉ" గం॥ 10-30 ని॥ లకు మీరు స్వయముగా గాని లేదా అడ్వకేట్ ద్వారా గాని పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ వారి ఎదుట హాజరై మీకు గల అభ్యంతరాలు తెలుపుకోవలెను, లేని ఎడల సదరు పిటిషను మీ పరోక్షముగా విచారించి తీర్మానించ బడును.

(శ్రీ కమిషన్ వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేదీ: 23.06.2025

ఇట్లు
సురానా మరియు సురానా అఖిల్ కృష్ణన్
అప్పీలుదారు తరుపున న్యాయవాదులు
విజయవాడ. సెల్ నెం. 9447965557

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL
Gr. & 1st Floor, Door No.31-31-21, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020

OA. NO..405/2020
Union Bank of India, Labbipeta Branch, Vijayawada.
Vs
M/s Rajadhani Cycle Company

To
M/s Rajadhani Cycle Company, represented by its Proprietor Ramesh Kumar Vadlamudi, D.No.29/37/7/10, Eluru Road, Seetharampuram, VIJAYAWADA-520002.

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEFS PRAYED FOR SHOULD NOT BE GRANTED

WHEREAS **O.A.405/2020** was listed before Hon'ble Presiding Officer/Registrar on **dt.26-08-2025**

WHEREAS the Hon'ble Tribunal is pleased to issue Summons/Notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs.30,07,001.55 Ps.** (application along with copies of documents etc., annexed).

In accordance with sub-section (4) of Section 19 of the Act, you, the defendants are directed as under:-
(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application,
pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is crated and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on **dt.26-08-2025 at 10.30 A.M.** failing the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this 7th day of June 2025
Signature of the Officer Authorized to issue summon

ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలోని అన్ని నదుల్లో వచ్చే అక్టోబర్ 15వ తేదీ వరకు ఎక్కడ కూడా ఇసుక తవ్వకాలుగాని, అక్రమంగా ఇసుక రవాణా గాని జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఃధవారం జిల్లా కలెక్టర్ నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలిసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నైరుతి రుతుపవనాల కాలంలో నదుల నుంచి ఇసుక తవ్వకాలను జాతీయ హరిత ట్రిబ్యునల్ నిషేధించిందన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారం ఈ నెల ఒకటో తేదీ నుండి వచ్చే అక్టోబర్ నెల15వ తేదీ వరకు జిల్లాలోని అన్ని నదుల్లో ఎక్కడ కూడా ఇసుక తవ్వకాలు జరగకుండా ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేషనల్ ప్రొసీజర్ (ఎస్ ఓ పి) తయారు చేయాలన్నారు. జిల్లాలో అక్రమంగా ఇసుక తవ్వకాలు గాని రవాణా గాని జరగరాదని, ఇందులో ఏమాత్రం రాజీ పడరాదని స్పష్టం చేశారు.అన్ని నదుల వద్ద రాత్రిపూట గట్టిగా నిఘా ఉంచి పోలీసు గస్తీలు సజావుగా జరగాలని ఆదేశించారు.ఇసుక స్టాక్ యార్డుల వద్ద ఉంచిన సీసీ కెమెరాలు సరిగా పనిచేస్తున్నాయా లేదా అని తనిఖీ చేయాలన్నారు. అన్ని నదులకు చేరుకునే రహదారి మార్గంలో కందకాలను తవ్వించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రతి నది వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి పాయింట్ లాగు పుస్తకము ఉంచి తనిఖీ చేసే పోలీసు, తహసిల్దారు విడిగా సంతకం చేయాలన్నారు. అందుకు సంబంధించిన ప్రతిని జిల్లా కమిటీకి అందజేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి సత్యనారాయణ, గనుల శాఖ డిడి శ్రీనివాసకుమార్, భూగర్భ జల శాఖ డిడి విజయవర్ధన్ రావు ,వాణిజ్య శాఖ సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ వెంకట్రావు

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : చెరువు మట్టి తవ్వకాల్లో అక్రమాలు జరిగినట్టు సాక్షాలతో చూపిస్తే సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. బుధవారం గన్నవరం మండల పరిధిలో పర్యటించారు. గన్నవరం మండలం, సావరగూడెం గ్రామంలో రూ. 40 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న రిటైనింగ్ వాల్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ. 96 లక్షల వ్యయంతో అల్లాపురం గ్రామం నుండి పాలిటెక్నిక్ కాలేజ్ మీదుగా జాతీయ రహదారిని కలుపుతూ నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు, దావాజీ గూడెం గ్రామ పరిధిలో నూతనంగా నిర్మించిన ఎన్.టీ.టి.ఎఫ్ కాలేజీ రోడ్డులకు ప్రారంభోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ చెరువుల్లో తవ్వకాలు నిర్వహించేవారు ఒక మీటరు కంటే ఎక్కువ లోతు తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామని, లారీల ద్వారా మట్టిని తరలించేందుకు అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో, దొంతు చిన్నా, గూడపాటి తులసీమోహన్, బోడపాటి రవికుమార్, మేడేపల్లి రమ, కాసర్నేని రంగబాబు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా అరుణమ్మ బాధ్యతల స్వీకారం

ప్రజాశక్తి-నందివాడ : నందివాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా సాధారణ బదిలీలలో భాగంగా సి.హెచ్ అరుణమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న గ్రామాల్లో బెల్టు షాపులు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

అపరిష్కృత కేసులను సత్వరమే పరిష్కరించండి : ఎస్‌పి

పజాశక్తి -కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చేలా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతిరోజు అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించి కేసులు పురోగతికి పాటుపడాలని తెలిపారు. మహిళల, పిల్లల సంబంధిత నేరాల విషయంలో పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్, రిజిస్ట్రేషన్ చేసి త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని సూచించారు. అదేవిధంగా స్కూల్లు, కాలేజీలో అవేర్నెస్ క్యాంపులు కండక్ట్ చేయాలని, పిల్లలకు బ్యాడ్ టచ్ మరియు గుడ్ టచ్ గురించి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మీకోసం కార్యక్రమం ద్వారా సామాన్య ప్రజలకు సత్వర న్యాయం అందించే దిశగా అడుగులు వేస్తూ స్నేహపూర్వక పోలీసింగ్ ప్రజలకు అందిస్తూ, మహిళలు, చిన్నారుల భద్రతపై దష్టి సారించాలని, అదేవిధంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. జిల్లాని గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి అందరూ కషి చేయాలని సూచించారు. గంజాయి కేసులకు సంబంధించి ఫార్వర్డ్ లింక్ మరియు బ్యాక్ వార్డ్ లింకు కనుగొని ముద్దాయిలను అరెస్ట్ చేయాలని సూచించారు. రహదారి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రమాదాలు జరగకుండా సైన్ బోర్డ్స్, బారికేడ్స్ ఏర్పాటు చేయాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే సమయాన్ని గుర్తించి ఆ సమయంలో విజిబుల్ పోలీసింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్ గురించి ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న ఎస్‌పి

డ్రైనేజీ నిర్మించాలని వినతి

ప్రజాశక్తి కోడూరు : కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మూడవ సచివాలయం దగ్గర రోడ్డుకు ఇరువైపులా పక్క డ్రైనేజీ నిర్మించాలని కోరుతూ కోడూరు గ్రామపంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావుకు గ్రామానికి చెందిన దాసి సునీల్ కుమార్ అర్జీ అందజేశారు. 2018 సంవత్సరం నుండి డ్రైనేజీ నిర్మించాలని పలుమార్లు దరఖాస్తులు పెడుతున్నప్పటికీ ఎవరు కూడా పట్టించుకోవడం లేదని తెలిపారు. కనీసం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా అయినా డ్రైనేజీ నిర్మించాలని

సునీల్ కుమార్ కోరారు.

వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలంలోని శారదాయిపేట సెంటర్లో సుల్తానగరం నుండి ముక్కొల్లు వరకు 3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆర్ అండ్ బి రోడ్డుకు పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్ బుదవారం శంకుస్థాపన చేశారు. అలాగే ఆకుల మన్నాడు గ్రామంలో 28 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్ల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసి చైర్మన్ పోతన స్వామి, ఆకుల మన్నాడు నారికేడాలపాలెం సర్పంచులు, మహమ్మద్ రఫీ, జంపన రమాదేవి, దాసరి ఉమసాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్‌ఎ కృష్ణప్రసాద్

ప్రభుత్వాసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలి : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-ఘంటసాల : ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. బుధవారం ఘంటసాల మండలం ఘంటసాలపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో జాతీయ ఆరోగ్య మిషన్ 15 ఆర్థిక సంఘం హెల్త్ నిధులు రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యరంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, మండల కేంద్రాల్లో పేదల కోసం విస్తత వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా ప్రసూతి వైద్య సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నూతన భవనం ల్యాబ్ అవసరాలకు వినియోగించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, దేవనబోయిన వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్ ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలోని ముస్తాబాదలో మట్టి ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మరణించాడు. నిర్లక్ష్యంగా ట్రాక్టర్ తోలడం వల్ల ఈ సంఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గ్రామ పంచాయతీ, వెదురు పావులూరు రెవిన్యూ పరిధిలోని పెద చెరువు లో పూడికతీత కింద మట్టి తవ్వకాలు ఏడు రోజులుగా జరుగుతున్నాయి. మంగళవారం ముస్తాబాద్ హైస్కూల్ వద్ద మట్టి ట్రాక్టర్ ఢీకొని సూరంపల్లి కి చెందిన గజ్జల వెంకటేశ్వరరావు తీవ్ర గాయాలకు గురయ్యాడు. మట్టి లోడు ట్రాక్ట ర్ స్పీడ్ గా వెళ్ళడంతో ప్రమాదం జరిగింది. వెంకటేశ్వరరావు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. గ్రామంలోని పెద్ద చెరువుమట్టిని ప్రైవేటు భూములకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్, మైనింగ్ డిపార్టుమెంట్, ఇరిగేషన్ డిపార్టుమెంట్ వెంటనే ఈ విషయం మీద విచారణ జరపాలని కోరుతున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి- తోట్లవల్లూరు : మండలంలోని చాగంటిపాడు గ్రామంలో జరిగిన నిమ్మకూరి ఆనందరావు (43) హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు పమిడిముక్కల సీఐ వై. చిట్టి బాబు తెలిపారు.భార్య నిమ్మకూరి సుపాద, కొడుకు వాసంత్ కలసి ఆనందరావును హత్యచేసారని వీరిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితులను గ్రామ సమీపంలోని పాడుపడిన చెడ్లో పట్టుకుని కోర్టుకి హాజరు పరిచామని తెలిపారు.

కిరాణా షాపులో చోరీ

చోరీ జరిగిన బడ్డీకొట్టు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : తోట్లవల్లూరు ప్రధాన సెంటర్‌లో వున్న తన కిరాణా షాప్‌లో మంగళవారం రాత్రి దొంగతనం జరిగిందని దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశానని కిరాణా షాప్ యజమాని ఖాదర్ తెలిపారు. మంగళవారం రాత్రి 11గంటల వరకు తను షాప్ లోనే వున్నానని తరువాత షాప్‌కు తాళాలు వేసి వెళ్లిపోయానని తెలిపారు. సుమారు 11.30 గంటల సమయంలో దొంగలు తాళాలు పగలుగొట్టి చోరీకి పాల్పడి ఉండొచ్చన్నారు. రూ. 20వేలు విలువచేసే సిగరెట్ దిండులు, రూ. 10వేలు నగదు దొంగిలించుకు పోయారని తెలిపారు. దొంగలు పగులకొట్టిన తాళాకప్పను కొంచెం దూరంలో వున్న రాజస్థాన్ టీ స్టాల్ వద్ద పడేసి వెళ్లిపోయాని తెలిపారు. దొంగతనాలు విచ్చలవిడిగా జరుగుతున్నా పోలీస్ సిబ్బంది నిర్లక్ష్యం గా వ్యవహారిస్తున్నారని, రాత్రి సమయాల్లో సిబ్బంది నిఘాకొరవడటం వల్లదొంగలకు అడ్డు అదుపులేకుండా పోయిందని అంటున్నారు. ఇటీవల రైతుల బోర్లు, వైర్లు దొంగతనం చేసిన ఘటన, చాగంటిపాడు, వల్లూరుపాలెం-బొడ్డపాడు ప్రధాన రహదారి వెంట విద్యుత్ మెయిన్ వైర్లు కిలోమీటర్ల మేర దొంగతనం, కరకట్ట వెంట వున్న బడ్డీకోట్లలో దొంగతనాలు మితిమీరి పోయాయాని పలువురు అంటున్నారు.

తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలి

ఇకెవైసి చేయిస్తున్న వ్యవసాయాధికారి గణేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పమిడిముక్కల : రైతులందరూ అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని పమిడిముక్కల మండల వ్యవసాయ గణేష్ రెడ్డి అన్నారు. బుధవారం రైతులతో రైతు సేవ కేంద్రంలోని ఈకేవైసీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రాయితీలు పొందాలంటే తప్పనిసరిగా అందరూ ఇకెవైసి చేయించుకో వాలన్నారు. మంటాడ, లంకపల్లి, కష్ణాపురం,పమిడిముక్కల కేంద్రాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఇకెవైసి చేస్తారన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని వెళ్లాలని సూచించారు.

జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులుగా డాక్టర్ సమరం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సర్వ సభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు డాక్టర్ సమరంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డాక్టర్ వెలగా జోషి జిల్లా వైస్ చైర్మన్‌గా, ఇ.చిట్టిబాబు జిల్లా కార్యదర్శిగానూ, బి.బాబ్జీ కోశాధికారిగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ టి.విజయలక్ష్మి, ఎం.అనురాధ, డాక్టర్ కొల్లేటి రమేష్, కర్లపాటి శ్రీనివాస్, ఎం.బలరాం, బి.సుధాకర్ , ఎస్.జోసెఫ్ జోషి, కె.జయరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారుగా డాక్టర్ ఎం.సి.దాస్, కె.పట్టాభిరామయ, జి.వి.రామారావు నియమితులయ్యారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, అధ్యక్షత వహించగా, రెడ్ క్రాస్ రాష్ట్ర పరిశీలకులుగా పి.సి.ఆర్.రాజు వ్యవహరించారు.

డైరెక్టర్ల ఎన్నిక బహిష్కరణ

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని కొత్తగూడెం విజయ పాల కేంద్రం వద్ద బుధవారం జరిగిన డైరెక్టర్ల ఎన్నికను రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి రైతు సంఘం మండల కమిటీ సభ్యులు సిహెచ్ సుబ్బారెడ్డిలు బహిష్కరించారు. రెండేళ్లకు ఒకసారి డైరెక్టర్లను ఎన్నుకుంటారని, ఇందులో భాగంగా ఇద్దరు డైరెక్టర్లను మారుస్తూ కొత్తవారిని ఎన్నుకునేందుకు చేతులెత్తే విధానం ద్వారా డైరెక్టర్లను ఎన్నుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో రైతు సంఘం నాయకులు అభ్యంతరం తెలిపారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. అనంతరం రైతుసంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి మాట్లాడుతూ చేతులెత్తే విధానం సరైన పద్ధతి కాదని, ఈ విధానం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతారని అన్నారు. కక్షలు కార్పణ్యాలకు తావిస్తుందన్నారు. ఇకనైనా ఈ విధానానికి స్వస్తి పలకాలని చైర్మన్‌లతో మాట్లాడినట్లు తెలిపారు.

పశువుల నీటి తొట్టెలు ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ప్రకృతి చల్లగా చూసి, ఈ ఏడాది వానలు బాగా పడాలని, రైతులు సాగు చేసిన పంట దిగుబడులతో వారి ఇంటా సిరిసంపదలు నిండాలని ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొని రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి ఎద్దడి పశుగణనానికి ఇబ్బంది కలగకుండా పశువుల నీటితొట్టి నిర్మాణాలు ఉపాధి హామీ పథకం తరుపున చేపట్టినట్లు తెలిపారు. పశువుల నీటి తొట్టెలను ప్రారంభిస్తూ ఇంకా అవసరమైన చోట చేపట్టాలని సూచించారు. చెత్త నుండి సంపద కేంద్రాన్ని సందర్శించి ఆవరణలో మొక్కనాటి మొక్కల ప్రాధాన్యతను చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో చెరుకూరు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొఠారు సత్యనారాయణ ప్రసాద్, గ్రామ సర్పంచ్ కసుకుర్తి శ్రీనివాసరావు, కానూరు కిషోర్, ఎంపీడీవో నితిన్, గద్దె రాజ్యలక్ష్మి, అగ్రికల్చర్ ఏడి భవాని, వైస్ ప్రెసిడెంట్ కపారావు పాల్గొన్నారు.

రూ.21 వేలు జీతం చెల్లించాలి : టిడిపి

ప్రజాశక్తి - విజయవాడ :

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అన్ని రకాల విధులు నిర్వహిస్తూ కార్మికులకు జిఒఎంఎస్ నెం.36, 2024 మార్చి 1 ప్రకారం జీతం రూ.21వేలు చెల్లించాలని టిడిపి ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి కోరారు. ఈ మేరకు ఎంప్లాయీస్‌తో కలిసి సెక్రటేరియట్‌లో మున్సిపల్ శాఖా మంత్రి నారాయణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో 121 పార్కులు ఉన్నాయి. ఈ పార్కులలో సుమారు 214 మంది గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నాము. కేవలం మొక్కలు కటింగ్ వంటి గార్డినరీ విధులే కాకుండా పార్కు లోపల వున్న డ్రైనేజీ కాల్వలు, మరుగుదోడ్లు క్లీనింగ్ చేయడంతో పాటు సందర్శకులు పార్కుకి వచ్చి వినియోగించి పారేసిన అనేకమైన వ్యర్థాలు, వీటితో పాటు ఎప్పుడూ రద్దీగా వుండే మెయిన్ రోడ్డులలో వున్న సెంటర్ డివైడర్లలో కూడా వుండే వ్యర్థాలను తొలగించడం, మొక్కలు కటింగ్ వంటి పనులు కూడా చేస్తున్నారన్నారు. సేవలను గుర్తించి జీతాలివ్వాలని కోరారు.

మహిళా సాధికారతే ఫిక్కీ లక్ష్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మహిళా సాధికారతే లక్ష్యంగా ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఫ్లో పని చేస్తోందని జాతీయ అధ్యక్షురాలు పూనమ్ శర్మ తెలిపారు. దేశంలో ఉన్న 14 వేల మంది మహిళా పారిశ్రామికవేత్తలు, ప్రొఫెషనల్స్, వేలాది మంది లబ్దిదారులకు ఫ్లో ప్రాతినిధ్యం వహిస్తోందని చెప్పారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను, వృత్తి నిపుణలను తయారు చేస్తూ మహిళా సాధికారత కోసం గత 41 సంవత్సరాలుగా ఫిక్కీ ఫ్లో క్రియాశీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. మహిళలు తమ ప్రతిభ, నైపుణ్యాలు, శక్తి సామర్థ్యాలను బహిర్గతం చేసేలా వారిని ప్రోత్సహించి, ఒక వేదిక కల్పించి, దేశ ఆర్థికాభివృద్ధిలో మహిళలను భాగస్వామ్యం చేసే లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో 21వ చాప్టర్‌ను విజయవాడలో నేడు ప్రారంభించామన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఫ్లో విజయవాడ చాప్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం విజయవాడలోని ఓ హోటల్ లో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఫ్లో జాతీయ అధ్యక్షురాలు పూనమ్ శర్మ పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రతిభ గల 15 మంది పేద విద్యార్థినులకు సైకిళ్లను బహూకరించారు. చేనేత వస్త్రాలను, కళాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో చేనేత ఉత్పత్తులతో ప్రదర్శనను ఏర్పాటు చేసారు. ఫ్లో సభ్యులు ప్రదర్శనను తిలకించి చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసారు. అనంతరం జాతీయ అధ్యక్షురాలు పూనమ్ శర్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రష్మి సరిత, విజయవాడ చాప్టర్ అధ్యక్షురాలు అమ్రిత కుమార్, మెంటార్ పద్మ రాజగోపాల్, గవర్నింగ్ బాడీ సభ్యురాలు ఉషారాణి మన్నే విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పూనమ్ శర్మ మాట్లాడుతూ విభజన ఆంధ్రప్రదేశ్లో ఫ్లో చాప్టర్ లేదని, ఇక్కడ ఆవశ్యకతను గుర్తించి దేశంలో 21 వ చాప్టర్ ను విజయవాడలో ఏర్పాటు చేశామన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రష్మి సరిత, విజయవాడ చాప్టర్ అధ్యక్షురాలు అమ్రిత కుమార్ మాట్లాడుతూ విజయవాడ, వైజాగ్, గుంటూరు నగరాల నుంచి 132 మంది సభ్యులు విజయవాడ చాప్టర్‌లో ఉన్నారని తెలిపారు. విజయవాడ చాప్టర్ ద్వారా అనేక

కార్యక్రమాలు నిర్వహించేందుకు రూపకల్పన చేశామని, దశల వారీగా చేస్తామని చెప్పారు. ముఖ్యఅతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫిక్కీ సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఫీక్కీ ఫ్లో 21వ చాప్టర్ విజయవాడ ఛైర్మన్‌గా నియమితులైన అమత కుమార్‌కి శుభాభినందనలు తెలిపారు. ఇప్పటికే 20 దేశాల్లో తన సేవలు అందిస్తున్న ఫీక్కీ విజయవాడలో 21వ ఛాప్టర్ ప్రారంభించటం చాలా సంతోషంగా వుందన్నారు. రాష్ట్రంలో డ్వాక్రా సంఘాల స్థాపన ద్వారా మధ్య తరగతి కుటుంబాల్లోని మహిళల ఆర్థికాభివృద్ధి సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో మార్గదర్శి ఎమ్.డి శైలజ కిరణ్, రేష్మ సరిత తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - విజయవాడ : నవ్యాంధ్ర చైతన్య వేదిక ఊరురా జన విజ్ఞానం కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ ఎంబీవికేలో నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కరపత్రాల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నవ్యాంధ్ర చైతన్య వేదిక గౌరవ అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు, కార్యదర్శి చింతకాయల చిట్టిబాబు సంయుక్తంగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ త్వరలో రెండు రోజులు వర్క్ షాప్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఊరురా జనవిజ్ఞానం రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ నవ్యాంధ్ర నిర్మాణం కేవలం ప్రభుత్వ కార్యక్రమమే కాదు 5 కోట్ల ప్రజలందరి కర్తవ్యం అని ఆయన అన్నారు. అమరావతి రాజధాని కృష్ణానది ఒడ్డున ట్యాంక్ బండ్ నిర్మించి తెలుగుజాతి మహనీయులు, స్వాతంత్ర సమరయోధులు, శాస్త్రవేత్తలు, రచయితలు నటులు కళాకారులు విగ్రహాలతో పాటు పద్మశ్రీ ఘంటసాల విగ్రహాన్ని కూడా నిర్మించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నవ్యాంధ్ర చైతన్య గీతాలను కోట వెంకటేశ్వర రెడ్డి, సుదర్శనరాజు, జె.ఎన్.ఎస్.ఝాన్సీ, కె.రాజ్యలక్ష్మి ఆలపించారు. జెవివి సభ్యులు కె.శ్రీనివాస్, జి.సుదర్శన రాజు, విజయ గణేష్, శోభన్, రామయ్య, ప్రచార కార్యదర్శి కె.వి నారాయణ, కార్యక్రమంలో చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు (ఎక్సరే) టి.సత్యనారాయణ, డాక్టర్ లింగాల, సుందర రామయ్య, డాక్టర్ అమర్నాథ్, యుక్తేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నవత కోటేశ్వరరావు కుటుంబానికి జల్లి విల్సన్ పరామర్శ



కోటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జల్లి విల్సన్ తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : వామపక్ష శ్రేయోభిలాషి, నవత ట్రాన్స్‌పోర్టు వ్యవస్థాపకుల్లో ఒకరు పర్వతనేని కోటేశ్వరరావు (నవత) కుటుంబ సభ్యులను బుధవారం మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్, గాంధీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సక్కుర్తి వెంకటేశ్వరరావు (రాజా), సిపిఐ నగర నాయకులు ఎ.రాము, కొడాలి ఆనందరావు, టి.సత్యనారాయణ, టి.నరసయ్య పరామర్శించారు. విజయవాడలోని నవత కోటేశ్వరరావు సంతతి పర్వతనేని రవి, కుటుంబసభ్యులను బుధవారం విజయవాడలోని ఆయన నివాసంలో పరామర్శించారు. అనంతరం కోటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి అలనాటి అనుబంధాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ వామపక్షాలంటే కోటేశ్వరరావుకు ఎనలేని గౌరవం, అభిమానం అన్నారు. రవాణా రంగంలోనే కాకుండా వివిధ రంగాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. కోటేశ్వరరావు ఆయన సోదరుడు సుబోస్ చంద్రబోస్ నవత ట్రాన్స్ పోర్టును స్థాపించి పట్టుదల, క్రమశిక్షణ, అంకురిత దీక్షతో దానిని దేశవ్యాప్తంగా విస్తరింపజేశారని గుర్తుచేశారు. వేలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. విజయవాడ ఆటోనగర్, స్వర్గపురి అభివద్ధికి కషి చేశారని తెలిపారు.

క్రీడాకారిణి సహస్రకు సన్మానం

ప్రజాశక్తి - విస్సన్నపేట : ఇండోనేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ స్కేటింగ్‌లో స్వర్ణ పథకం సాధించిన కోట సహస్ర సాన్వి భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో గౌరవం తీసుకొచ్చిందని ఆమె స్వగ్రామం తెల్లదేవరపల్లి కావటం మరో విశేషం అని ఎంఎల్ఎ కొలికపూడి అన్నారు. ఈ సందర్భంగా కోట సహస్ర సాన్వి ని అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విస్సన్నపేట మండలం తహశీల్దార్ కె.లక్ష్మీ కళ్యాణి, ఎంపిడిఒ చిన్న రాట్నాలు, తెల్లదేవరపల్లి గ్రామ సర్పంచ్ రాయల నాగరాణి, రాయల

సురేష్(రాజా) రాయల సుబ్బారావు, మోరంపూడి రవిబాబు, కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదాదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : చిట్టినగర్ చిట్టి తిరుపతిగా వెలుగొందుచున్న పద్మావతి గోదాదేవి సమేత గరుడాచల స్థిత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమ య్యాయి. విద్యుత్ అలంకరణలు, చలువ పందిర్లతో దేవస్థానం ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో అలరారుతుంది. తొలి రోజు బుధవారం ఉదయం 6 గంటలకు కృష్ణానది తీరాన 108 మంది పుణ్యస్త్రీలచే దుర్గా ఘాట్ నుండి 108 కళాశలతో కృష్ణా జలాలను తీసుకువచ్చి పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి 108 కలశాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. దేవస్థాన కార్యదర్శి డాక్టర్ మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి న్యాయవాది పిళ్ళా శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి పొట్నూరి రాజా, వైస్ ప్రెసిడెంట్ మరుపిళ్ల సత్యనారాయణ, కామందుల నరసింహారావు, బంక హనుమంతరావు, పోతిన ధర్మారావు, పోతిని సాంబశివరావు, రాంపిల్ల వాసు, తమ్మిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట

రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనదారులకు ట్రాఫిక్ ఎస్ఐ బుధవారం జరిమానా విధించారు. మండలంలోని పోచంపల్లి గ్రామానికి వెళ్లడానికి ఇటీవల నూతనంగా తారురోడ్డు వేశారు. ఆ గ్రామానికి, ఆయా పరిసర గ్రామాలకు వెళ్లేవారు కొందరు కొంగర మల్లయ్య గట్టు సమీపంలో సాయిబాబా గుడి వద్ద నుండి క్రాసింగ్ అవతల పక్కకు రాంగ్‌రూట్‌లో వెళ్తుండటం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే నాలుగైదు ప్రమాదాలు జరిగాయి. కనీసం డేంజర్ లైట్లు గానీ సిగ్నల్ లైట్లు వేయకుండా అతివేగంగా వెళ్ళటం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నావి. టూ వీలర్స్ కాకుండా ట్రాక్టర్లు, కార్లు కూడా ఆ మార్గాన పోవడంతో తీవ్రత మరింత ఎక్కువవుతోంది. దీంతో బుధవారం జగ్గయ్యపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు, మొబైల్ సిబ్బంది సంయుక్త నేతృత్వంలో అక్కడ ఎవరైతే రాంగ్‌రూట్‌లో వస్తున్నారో ఆ వాహనాలను ఆపి వారిపై జరిమానా విధిస్తున్నారు. ఇది నిత్యం కొనసాగాలని ప్రజలు కోరుతున్నారు. ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలకు వాహనదారులు సహకరించాలని జగ్గయ్యపేట ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు వాహనదారులను కోరుతున్నారు.

టైలరింగ్ సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి - వీరులపాడు

జుజ్జూరు గ్రామంలో టైలరింగ్ శిక్షణ పొందిన వారికి బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి షేక్ చాంద్ బేగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో జిల్లా జనశిక్షణా అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణిమా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందాలని పలు శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రామావత్ కోటి టైలరింగ్ శిక్షణ తీసుకున్న మహిళలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యే లక్ష్యం

- 'లక్ష్య' స్కూల్ చైర్మన్ విస్సంశెట్టి శివనాగరాజు

ప్రజాశక్తి-కోడూరు : 'మీ లక్ష్యం శిఖరమైతే మా ఆశయం ఉన్నతం.. మీ లక్ష్య సాధనకై మా లక్ష్య సంసిద్ధమనే' దానిపై సముద్ర తీరప్రాంతమైన కోడూరు మండల ప్రజలకు కార్పొరేట్ తరహా విద్య అందించడానికి 2018 లో విద్యారంగంలోకి లక్ష్య స్కూల్ తొలి అడుగు వేసినట్లు చైర్మన్ విస్సంశెట్టి శివ నాగరాజు తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా అవనిగడ్డ నియోజకవర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎంపికై ఎందరికో మార్గదర్శకులు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్, 8 సంవత్సరాలు అసిస్టెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేసి రీసెర్చ్ స్కాలర్ ఇన్ యూనివర్సిటీ పుత్ర మలేషియా చేశానని, మన ప్రాంతంలో విద్యారంగం వెనుకబడి ఉందని గ్రహించి విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో స్కూల్ ను ప్రారంభించినట్లు తెలిపారు. కోడూరు మండలంలో గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం 580 కి పైగా మార్కులు సాధిస్తున్న ఏకైక స్కూల్ మా లక్ష్య స్కూల్ మాత్రమే నని, ఈ ఏడాది జరిగిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో తమ స్కూల్ నుండి 600 మార్కులకు గాను 580 మార్కులు పైగా వచ్చిన విద్యార్థులు 8 మంది ఉన్నారని అన్నారు. బోధనా నైపుణ్యం సుదీర్ఘమైన అనుభవం మరియు అంకితభావం కలిగిన అధ్యాపకులు కలిగి ఉన్నామని, క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తున్నామని వివరించారు. ఐఐటి, మెడికల్ లో ఫౌండేషన్ ఉండే విధంగా మ్యాక్స్, సైన్స్ సబ్జెక్టులను బోధిస్తున్నామని, భారతీయ సంప్రదాయాలను విద్యార్థులకు అలవాడేలా మతాలకు సంబంధం లేకుండా ప్రతి పండుగను స్కూల్లో నిర్వహిస్తున్నామన్నారు. ఆర్థికంగా చితికిపోయి అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులకు చేయూతగా విద్యార్థులకు హెల్పింగ్ నేచర్ అలవాటు అయ్యేలా వారితోనే ఫండింగ్ కలెక్ట్ చేసి విద్యార్థుల సమక్షంలో ఆ బాధితులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నామన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న దృశ్యం

అదే విధంగా గత ఏడాది విజయవాడ వరద బాధితులకు సుమారు 2 లక్షలు మా స్కూల్ తరఫున అందజేశామన్నారు. పలుమార్లు జిల్లా స్థాయిలో జరిగే కాంపిటీషన్స్‌లో గెలిచి రాష్ట్రస్థాయికి ఎంపికవడం, ప్రతి ఏడాది ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధిస్తున్నామని, స్కూల్లో నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్ల ద్వారా ప్రతి విద్యార్థి పాల్గొని కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూ వారికి ఎన్నో విషయాలు తెలియజేస్తున్నామన్నారు.

సిసి రోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

సిసి రోడ్లు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఉపాధి హామీ పథకం నిధులు రూ 64 లక్షలతో 1070 మీటర్ల మేర నూతనంగా నిర్మించిన 15 సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ బుధవారం ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కష్ణా నదికి భారీ వరదలు సంభవించిన సమయంలో తమ గ్రామానికి ఇచ్చిన మాట ప్రకారం నూరు శాతం సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాదును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్, టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ప్రాజెక్టు చైర్మన్ దేవన బోయిన వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి గాజుల శంకర్రావు, మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, ఎంపీడీవో ఎం మరియాదేవి, మాజీ ఎంపీపీ బం డే కనకదుర్గ పాల్గొన్నారు

నాణ్యమైన బియ్యంతో మధ్యాహ్న భోజనం : జెసి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో మధ్యాహ్న భోజన పథకం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గహాలకు 9,647 సంచుల సూపర్ ఫైన్ నాణ్యత గల బియ్యాన్ని సరఫరా చేశామని, విద్యార్థులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని చిలకలపూడి శ్రీ పాండురంగ స్వామి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సంయుక్త కలెక్టర్ సూపర్ ఫైన్ నాణ్యత గల 25 కిలోల సంచుల బియ్యాన్ని పాఠశాల ప్రధానోపాధ్యా యులు జీ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకం కింద విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో సూపర్ ఫైన్ రకం నాణ్యత గల బియ్యాన్ని ఈ జూన్ మాసం నుండి సరఫరా చేయాలని ఆదేశించిందన్నారు. ఆ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 6,855 సంచుల బియ్యం,

బియ్యం బస్తాలు అందిస్తున్న జెసి

సంక్షేమ వసతి గృహాలకు 2,792 సంచుల బియ్యం ఇప్పటికే చేరవేశామన్నారు. ప్రతి సంచి పైన క్యూఆర్ కోడ్ తో పాటు సంబంధిత రైతు పేరు, పిపిసి కేంద్రము, బియ్యం రకము, రైస్ మిల్లు, స్టోరేజ్ గోదాము, ధ్రువీకరించిన సాంకేతిక వ్యక్తి పేరు, మొదటి ప్యాకింగ్ ఏజెన్సీ పేరు తదితర వివరాలు ముద్రించబడి ఉంటాయన్నారు. ఇందులో ఏమాత్రం అవకతవకలకు తావు లేకుండా సక్రమంగా పంపిణీ అయ్యేందుకు పారదర్శకంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శిరీష, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి వెంకటేశ్వరరావు, ఎంఈఓ గురు ప్రకాష్ తదితర తదితరులు పాల్గొన్నారు .

కెయులో యోగా మాసోత్సవాలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా కృష్ణా విశ్వవిద్యాలయంలో యోగా మాసోత్సవాలు నిర్వహిస్తు న్నారు. ఉపకులపతి ఆచార్య కె రాంజీ నేతత్వంలో యోగా గురూజీ శ్రీనివాస్ ఆన్లైన్ లో యోగా తరగతులు 21 వ రోజుకు చేరుకున్నాయి. యోగా మాసోత్సవాలు లలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం తో పాటు యోగా వల్ల కలిగే ప్రయోజనాలు పై ప్రత్యేక తరగతులు చేపట్టారు. ఈ నెల 21 వ తేదీ వరకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఆన్లైన్ యోగా తరగతులు ఉంటాయని బయోటెక్నాలజీ విభాగం సహాయ ఆచార్యులు, యోగ శిక్షకురాలు డా. ఎల్ సుశీల తెలిపారు.

క్రమశిక్షణకు మారుపేరు 'ఆర్కే' విద్యాసంస్థలు



ప్రజాశక్తి- మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నంలో ఆర్కే విద్యాసంస్థలు స్థాపించింది మొదలు గత 16 సంవత్సరాలుగా విద్యార్థులు తల్లిదండ్రుల ఆదరాభిమానాలు విశేషంగా పెంపొందించుకుంటుంది. క్రమశిక్షణకు మారుపేరు ఆర్కే విద్యా సంస్థలు అన్నట్లుగా బ్రాండ్ ఇమేజ్ ని సాధించినట్లు ఆర్కే విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ బండి రామకష్ణ పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఎంసెట్ ఐఐటి జేఈఈ మెయిన్స్ విభాగాలలో సంచలనాలు సష్టించేలా అత్యుత్తమ ఫలితాలు సాధించడం ఆర్కే విద్యాసంస్థల విద్యార్థులకు అలవాటుగా మారిపోయిందన్నారు.

ఆర్కే విద్యా సంస్థల ప్రిన్సిపాల్ శివరామకృష్ణ మాట్లాడుతూ అత్యుత్తమమైన ఫ్యాకల్టీ, మంచి గాలి వెలుతురుతో కూడిన విశాలమైన తరగతి గదులు, ఆర్కే విద్యా సంస్థల మెరుగైన ఫలితాల సాధనకు బలమైన పునాదిగా ఉన్నాయన్నారు. తద్వారా టాప్ గ్రేడ్ విద్యార్థులు ఆర్కే విద్యా సంస్థల నుంచి ప్రతి ఏటా తయారవుతున్నారు. తమ పిల్లల పట్ల తల్లిదండ్రుల ఆలోచనలు ఆశయాలకు తగ్గట్టుగా మంచి క్రమశిక్షణ భద్రతకు ఆర్కే కాలేజీ కేరాఫ్ అడ్రస్ గా తీర్చిదిద్దామన్నారు. బాలురకు బాలికలకు వేరువేరుగా తరగతి గదులు నిర్వహిస్తూ ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరా పర్యవేక్షణ, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితులకు తగ్గట్టుగా అందుబాటులో ఉండే ఫీజులు ద్వారా అందరి విద్యాసంస్థ ఆర్కే విద్యాసంస్థలు అనే భరోసాని సంపాదించుకోగలి గామన్నారు. చదువులో విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి ఉన్నతమైన శిక్షణ ఇవ్వడం ఒత్తిడి లేని విద్యను అందివ్వడం ఆర్కే విద్యా సంస్థల ప్రత్యేకత అన్నారు. జేఈఈ మెయిన్స్ లో కూడా మచిలీపట్నంలోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న కాలేజీ ఏదైనా ఉందంటే అది ఆర్కే విద్యాసంస్థలు మాత్రమేనని ప్రిన్సిపాల్ దేవాబత్తుల శివరామకష్ణ తెలియజేశారు.

ఉత్తమ ఫలితాల సాధన : 2025 విద్యా సంవత్సరం జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో ఎల్ ప్రణతి, కే విక్రాంత్, ఏ లత, ఎన్ షణ్ముఖ ప్రియా 470 మార్కులకు 465 మార్కులు సంపాదించి సంచలనం సష్టించారు. బైపీసీలో సిహెచ్ రమ్యశ్రీ ,కే అనిత ,ఎం జశ్వితశ్రీ 440 మార్కులకు గాను 434 మార్కులు సాధించి ఆర్కే విద్యాసంస్థల విజయకేతనం ఎగరవేశారు. ఇవి మచిలీపట్నం టౌన్ ఫస్ట్ ప్లేస్ సాధించిన ఫలితాలు అన్నారు ఏం చస్మిత సాయిశ్రీ, ఎన్ మణికంఠ, సి హెచ్ సాత్విక్, కే కార్తీక్ ఉదయతేజ 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్లో ఎంపీసీ విద్యార్థులు ఎంపీ శ్రీవల్లి 1000/ 987 మార్కులు ఎం ఎన్ మదుల 1000 కి 986 మార్కులు బైపిసి లో వి స్వప్నిక 1000/973 మార్కులు సాధించారు. ఎంసెట్లో రాజులపాటి హిమబిందు 1430 వ ర్యాంకు సాధించిందన్నారు. టి మోహన్ తేజ 1912 ర్యాంకు సాధించారు.

చైర్మన్, డైరెక్టర్లను అభినందిస్తున్న దృశ్యం

గుడ్లవల్లేరు ఎఎంసి చైర్మన్ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వంలో తామంతా కలిసికట్టుగా ముందుకు సాగుతున్నామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ప్రాంగణంలో గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ముందుగా చైర్మన్ పొట్లూరి రవికుమార్, వైస్ ఛైర్మన్ కూనపురెడ్డి కళ్యాణకష్ణ ఇతర సభ్యులచే ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ పనిచేసేవారికీ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మార్కెట్ యార్డు డైరెక్టర్లుగా చందన వెంకటరాజు, గడ్డం బాలకుమారి, గాజుల నాగ పల్లవి, గోపు వెంకటలక్ష్మి, జఫ్రుల్లా ఖాన్ పటాన్, కల్వకుంట వెంకటేశ్వరరావు, కొల్లూరి రాణి,కొప్పుల దుర్గా వెంకటేశ్వరరావు, పి.అచ్యుతాంబ, తూము పద్మజ, అనగాని లీలా అనిల్ కుమార్, కంతేటి వెంకట సుబ్బారావు, టి.నాగలక్ష్మిలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్ర మంలో ఏపీ ఎస్ డబ్ల్యూ సి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వ రరావు, గుడివాడ జనసేన పార్టీ ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి పాల్గొన్నారు.

అరిసేపల్లిలో ఏరువాక ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : పుడమి తల్లిని పూజించి వ్యవసాయ పనులు ప్రారంభించే ఈ శుభదినం ఏడాది పొడవునా అన్నదాతలకు సిరులు పండేలా చేయాలని మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకష్ణ ఆకాంక్షించారు. మచిలీపట్నం మండలం లోని అరిసేపల్లి గ్రామంలో పాల్గొన్న రామకృష్ణ రైతన్నలందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, కుంచె నాని, కాగిత వెంకటేశ్వరరావు, గడ్డం రాజు, లంకె వెంకటేశ్వారావు, కాటం మధుసూదన్ రావు ,లంకే శేషగిరి, తలారి సోమశేఖర్, శివ ,చంటి, మండల వ్యవసాయ శాఖ అధికారిని డి హారిక,కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొండలమ్మ దేవస్థానంలో పూజలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవ స్థానంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా చండీ హెూమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. ఈనెల 13వ తేదీన లక్ష మల్లెల పూజ కార్యక్రమం జరుగుతుందని, ఉదయం 6గంటలకు శ్రీ అమ్మవారికి అభిషేకం, 8 గంటల నుండి లక్ష మల్లెల పూజ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - విజయవాడ : పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరావు ఎన్‌సి హెచ్, శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో కోరారు. పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ, మధ్యాహ్నం భోజనం, స్కూలు శానిటేషన్ వర్కర్స్, స్కూల్ నైట్ వాచ్మెన్ కార్మికులు జీతాలు వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో కార్మికులకు జీతాలు విడుదల చేయకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పిల్లలకు జూన్‌లో ఫిజులు, కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు విడుదల చేయకపోతే అందర్నీ కలుపుకొని ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

పశువుల షెడ్లు ప్రారంభం

ప్రజాశక్తి - విస్సన్నపేట : విసన్నపేట మండలం తాతకుంట్ల గ్రామం లంబాడి తండాలోని మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా నూతనంగా నిర్మించిన పశువుల షెడ్లను బుధవారం టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు పులపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టిడిపి సీనియర్ నాయకులు డాక్టర్ ఎన్ టి వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

పలువురు ఉద్యోగుల బదిలీ

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో పని చేస్తున్న నలుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. దీనికి సంబంధించిన ఆలయ అధికారులకు దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ఏఈఓ జి.ఉమాపతి వెంకటేశ్వర స్వామి ఆలయం ద్వారకా తిరుమలకు బదిలీ కాగా, ఎం.తిరుమలేశ్‌రావు విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయానికి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో జంగం శ్రీనివాసరావు విజయవాడ నుంచి రానున్నారు. ఆలయ సూపర్డెంట్ ఎల్.శ్రీనివాసరావు కూడా విజయవాడ బదిలీ కాగా విజయవాడ నుంచి ఈ లక్ష్మణ్ అతని స్థానంలో వస్తున్నారు. ద్వారకాతిరుమల నుంచి సూపరింటెండెంట్ సింహరాజు, విజయవాడ నుంచి సీనియర్ అసిస్టెంట్ బి.నాగేశ్వరరావు బదిలీపై పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి వస్తున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఎమ్మెస్ ప్రకాష్ రావు పెనుగంచిప్రోలు నుంచి అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయానికి బదిలీ అయ్యారు.

అదనపు డార్మెంటరీ గదుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎ.కొండూరు : కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సర్కారు బడుల్లో విద్యా ప్రమాణాలు పెంచి, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఎ.కొండూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సర్వ శిక్ష అభియాన్ నిధులు ఒక కోటి 64 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ఆరు డార్మెంటరీ అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు.

ఖరీఫ్‌పై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - తిరువూరు : వికసిత కృషి సంకల్ప అభియాన్ 2025 ప్రీ ఖరీఫ్ కార్యాచరణపై వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం మండలంలోని కాకర్ల, లక్ష్మీపురం, మునుకుళ్ళ గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. భూసార పరీక్ష ఆధారిత ఎరువుల వాడకం, జీవన ఎరువుల ప్రాము ఖ్యత, సేంద్రీయ ఎరువుల ప్రయోజనాలు, పచ్చి రొట్ట ఎరువులు, ఖరీఫ్‌కు అనువైన వరిరకాల గురించి, కేంద్ర ప్రభుత్వ పథకాలను రైతులకు వ్యవసాయశాఖ మండల అధికారి పద్మ వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పి.కిషోర్ వర్మ వరిలో, పత్తిలో కొత్త వంగడాలు, కలుపు నివారణ, మామిడిలో పురుగులు, తెగుళ్ల నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజప్ప, బి.రాజశేఖర్ రెడ్డి, మహేశ, టి.జస్వంత్ రెడ్డి, పి.ఎన్.శివ ప్రసాద్,లక్ష్మీ కళ, వ్యవసాయ అధికారులు షేక్.టిప్పు సుల్తాన్, పశుసంవర్థక శాఖాధికారి గోపాలకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి పి.కావ్య సింధు, జి.అరుణ్ కుమార్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి పద్మ

యుఇఇయు రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

విజయవాడ : యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర 11వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం రామరాజ్యం నగర్ సెక్షన్ కార్యాలయం ముందు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రీజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.రాజు, జి.కనకలింగేశ్వరావు, రీజనల్ కమిటీ సభ్యులు కె.రాజశేఖర్ యూనియన్ సభ్యులు విజయ్ కుమార్, యం.శ్రీకాంత్,వినయ్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ మహాసభలకు ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ నాయకులు, దక్షిణాది రాష్ట్రాల సిఐటియు అనుబంధ సంఘం విద్యుత్ రంగ నాయకులు సిఐటియు రాష్ట్ర నాయకులు యూనియన్ రాష్ట్ర, డిస్కం, రీజనల్, డివిజన్ నాయకులు, సభ్యులు ప్రతినిధులుగా హాజరు కాబోతున్నారని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పోలీసులకు సన్మానం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్ల బదిలీపై వివిధ స్థానాలకు వెళ్తున్న సందర్భంగా ఎంఎస్‌కె అర్జున్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టారు. బుధవారం హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్, కానిస్టేబుల్ నరేష్ కుమార్, సురేష్ ఇతర పోలీస్ స్టేషన్లకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. ఎఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు తిరుపతిరావు పాల్గొన్నారు.

గోకులం షెడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : కంచల గ్రామంలో లబ్ధిదారుడు రామిరెడ్డి రామారావుకు రూ.2,32,000లతో గోకులం షెడ్డును మండల టిడిపి అధ్యక్షుడు వీరంకి వీరాస్వామిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గ్రామ పార్టీ అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ కొమ్ముకూరి కృష్ణ పాల్గొన్నారు.

చెక్కులు అందజేత

ప్రజాశక్తి - విజయవాడ : కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకున్న పలువురికి సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎంఎల్ఎ బొండా ఉమామహేశ్వరరావు బుధవారం అందజేశారు. సింగ్ నగర్‌కు చెందిన జి.హేమ శివకు రూ.42,684లు, కె.హేమంత్‌కు రూ.33,332 అందించారు.

పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ధారావత్ రవీంద్ర నాయక్ తెలిపారు. వేసవి సెలవులు ముగిసిన అనంతరం ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలో తెలుసుకొని ఉన్నాయి. మండలంలో 33 ప్రభుత్వ పాఠశాలలో ఉండగా అందులో 2,569 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వీరికి మొదటి సెమిస్టర్‌కు సంబంధించి పదివేల ఎనిమిది వందల పద్నాలుగు పాఠ్య పుస్తకాలు, 1,788 బుక్స్, 15090 నోట్ బుక్స్ వచ్చాయన్నారు. అలాగే ఒకటో తరగతి విద్యార్థులకు 205, ఆరో తరగతి విద్యార్థులకు 229 మందికి అవసరమైన డిక్షనరీలు వచ్చాయని తెలిపారు. 2,569 మంది విద్యార్థులకు బ్యాగులు వచ్చాయని, యూనిఫామ్ షూస్ రావాల్సి ఉందన్నారు. ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎపిడబ్ల్యుజెఎఫ్ నేతల విజ్ఞాపనలపై రెవెన్యూ అధికారుల హామీ

ప్రజాశక్తి - యంత్రాంగం : దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టులను సమస్యలను పరిష్కరించాలని పలువురు జర్నలిస్టు సంఘ నేతలు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ బుధవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ జిల్లావ్యాప్తంగా డిమాండ్స్ డే పాటించారు. ఈ సందర్భంగా విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ స్వర్ణలతకు, ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియకు ఫెడరేషన్ నేతలు వినతిపత్రాలు అందజేశారు. జిల్లావ్యాప్తంగా రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఆర్‌డిఒలను, మండల కేంద్రాల్లో తహశీల్దార్లను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. జర్నలిస్టుల సమస్యల గురించి అధికారులకు వివరించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, అక్రిడిటేషన్ కమిటీలో ఫెడరేషన్, ఎపిబిజెఎలకు ప్రాతినిధ్యం కల్పించాలని, జర్నలిస్టులకు సంబంధించిన వివిధ కమిటీల ఏర్పాటు చేయాలని, మీడియా అకాడమీని బలోపేతం చేయాలని, జర్నలిస్టుల అవార్డులు ప్రకటించాలని, ఉద్యోగ భద్రత కల్పించి కార్మిక బీమా సదుపాయం వర్తింపజేయాలని, జర్నలిస్టులకు వద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని ఫెడరేషన్ నేతలు డిమాండ్ చేశారు. వీటితోపాటు స్థానికంగా జర్నలిస్టుల సమస్యల గురించి ఆ వినతిపత్రాల్లో ప్రస్తావించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల కేటాయింపు సమస్యతోపాటు ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమాల్లో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజ నేయులు, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, రాష్ట్ర నాయకులు కొండబాబు, నగర నాయకులు చొప్పా రాఘవేంద్ర శేఖర్, ఎన్.నరేంద్ర కుమార్, బాషా, జోతిర్మయి, ఫణీశ్వరి పాల్గొన్నారు.

ఇంకా నందిగామలో ఆర్‌డిఒ బాలకష్ణకు ఫెడరేషన్ నేతలు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా నాయకులు ఆకుల వెంకట నారాయణ, నాయకులు శ్రీనివాసరావు, మీడియా ప్రతినిధులు అనిల్, సురేష్, ఖుద్దూ, చందు, రాజు, సాంబప, నరసింహ, మీరా, సీత రామ్ పాల్గొన్నారు. ది న్యూ ఇండియా జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు పటాన్ మీరా హుస్సేన్ ఖాన్ సంఘీభావం తెలియజేశారు. ఇబ్రహీంపట్నం తహశీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సాయి మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నేతలు ఎ.బాబు, ఎం.రాఘవులు, ఎస్.నాగరాజు, అడపా శివ, సీహెచ్ మురళి, సత్య, బొమ్ము గోపి, వి. నాగరాజు, మేకల భాను, సీహెచ్ రాంబాబు, సల్మాన్, దాసి ప్రతాప్, పల్లె నరేష్, ఎం.రమేష్ పాల్గొన్నారు. జగ్గయ్యపేట తహశీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కెశ్రీదేవిని నేతలు కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నేతలు వి.రవిశేఖర్, జె.వెంకటరావు, కె.శివరామకష్ణ, ఏ.శివాజీ, ఎం.విజయపాల్ పాల్గొన్నారు. గంపలగూడెం తహశీల్దారు కార్యాలయంలో నేతలు జి.అంజయ్య, రాయల ఆంజనేయు మూర్తి వినతిపత్రం అందజేశారు. రెడ్డిగూడెంలో తహసీ ల్దారు జె.సుశీలా దేవికి మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు కె శ్రీనివాసరావు, సిహెచ్. విజయ కుమార్, బి.సి.హెచ్.వి.సూర్యనారాయణ, ఎం.ప్రసా దరావు, కె.శ్రీను, సిహెచ్.ప్రవీణ్, సిహెచ్. సుబ్బారావు, ఎం.వంశీ, బి.ప్రసాదరావు పాల్గొన్నారు. వత్సవాయి, పెనుగంచిప్రోలు తహశీల్దారు కార్యాలయాల్లో నాయకులు కరిచే రత్నబాబు, గుడేటి దాస్, పర్వీన్ వినతిపత్రాలు అందించారు. మైలవరంలో డిప్యూటీ తాసిల్దారు బానోతు మోరియాకు నేతలు సిహెచ్.రాజారెడ్డి, మురళి బాబు, హరికష్ణ, కష్ణ ప్రసాదు విజ్ఞాపన పత్రం అందించారు. ఎ.కొండూరు డిప్యూటీ తహశీల్దారు యు.రాజ్ కుమార్‌కు నాయకులు మరీదు జమలయ్య, మరిది చెన్నారావు ఎండి అబ్దుల్లా, ఎండి అక్బర్ వినతిపత్రం అందించారు. జి.కొండూరు డిప్యూటీ తహశీల్దారు పి.విజయ్ కుమార్‌కు నాయకులు వీసం సురేష్ బాబు, చింతకాయల రాంబాబు, మంతెన శ్రీనివాస్, కూరపాటి ప్రకాష్, ప్రసాద్, విస్సన్నపేట తహశీల్దారు కార్యాలయంలో కృష్ణ వినతిపత్రాలు అందజేశారు.

జెసి ఇలక్కియకు వినతిపత్రం అందిస్తున్న ఫెడరేషన్ నేతలు వెంకట్రావు, ఆంజనేయులు, కలిమిశ్రీ, నాథన్, జోతిర్మయి, ఫణీశ్వరి తదితరులు

నందిగామలో

ఇబ్రహీంపట్నంలో

జగ్గయ్యపేటలో

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

- రెవెన్యూ అధికారులకు ఏపిడబ్ల్యుజెఎఫ్ నేతల వినతి

గన్నవరంలో డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ఫెడరేషన్ కృష్ణాజిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.వెంకటప్పయ్య, వై.శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి-యంత్రాంగం: జర్నలిస్టుల న్యాయ బద్ధమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని పలువురు అధికారులు హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల కేటాయింపు సమస్యతోపాటు ఇతర సమస్యలన్నింటినీ పరిష్కరిం చేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఇచ్చిన పిలుపుమేరకు కృష్ణాజిల్లాలో జర్నలిస్టులు డిమాండ్స్ డే పాటించారు. ఈసందర్భంగా కృష్ణాజిల్లాలో పలుచోట్ల జర్న లిస్టుల సమస్యలపై మండల తహశీల్దార్లకు వినతి పత్రాలను అందజేశారు. జర్నలిస్టుల సమస్యల గురించి అధికారు లకు ఫెడరేషన్ నాయకులు వివరించి వినతిపత్రాలు అందజేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిం చాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, అక్రిడిటేషన్ కమిటీలో ఫెడరేషన్, ఎపిబిజెఎలకు ప్రాతినిధ్యం కల్పించాలని, జర్నలిస్టులకు సంబంధించిన వివిధ కమిటీల ఏర్పాటు చేయాలని, మీడియా అకాడమీని బలోపేతం చేయాలని, జర్నలిస్టుల అవార్డులు ప్రకటిం చాలని, ఉద్యోగ భద్రత కల్పించి కార్మిక బీమా సదుపాయం వర్తింపజేయాలని, జర్నలిస్టులకు వదా శ్రమం ఏర్పాటు చేయాలని ఫెడరేషన్ నేతలు డిమాండ్ చేశారు. వీటితోపాటు స్థానికంగా జర్నలిస్టుల సమస్యల గురించి ఆ వినతిపత్రాల్లో ప్రస్తావించారు.

గన్నవరం తహశీల్దార్ కార్యాలయంలో డిటి భవానీకి జర్నలిస్టులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.వెంకటప్పయ్య, వై.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.అచ్యుతరావు, గన్నవరం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు బాలస్వామి, సురేష్, ప్రతినిధులు ఎన్.శ్రీనివాసరావు, డి.ఉదయ్, సిహెచ్.వెంకటేశ్వరరావు, బడుగు ప్రకాష్, ఆవుటపల్లి సారధి పాల్గొన్నారు. గుడ్లవల్లేరులో తహశీల్దారు బి.లోకరాజుకు వినతిపత్రం అందజేశారు. ఫెడరేషన్ నాయకులు కె.కోటయ్య, ఐ. రాంబాబు పాల్గొన్నారు. కంకిపాడులో డిప్యూటీ తహశీల్దా రుకు ఫెడరేషన్ నాయకులు ఎల్‌టిఎస్‌వి.ప్రసాద్, ఇ.శివప్రసాద్, బి.రాజు వినతిపత్రం అందజేశారు. నంది వాడ తహశీల్దారు ఎన్.గురుమూర్తికి నేతలు ఎన్. శివనా గరాజు, జి.మణికంఠ అందజేశారు. పామర్రు తహశీ ల్దారుకు నాయకులు శ్రీధర్ వినతిపత్రం అందజేశారు.

తోట్లవల్లూరులో...

పలుచోట్ల 'అంగన్వాడీ పిలుస్తోంది'

ప్రజాశక్తి- తోట్లవల్లూరు : మండలంలోని పెనమకూరు అంగన్వాడి పాఠశాలలో బుధవారం అంగన్వాడీ పిలుస్తోంది రా కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్ నాగమల్లేశ్వరి,అంగన్వాడీ కార్యకర్త జి.జ్యోతి, పి.లక్ష్మి, చిన్నారి తదితరులు పాల్గొని గ్రామంలోని ఇంటింటికి తిరిగి మూడు సంవత్సరాలలు దాటిన పిల్లలను అంగన్వాడి పాఠశాలలో చేర్పించారు.**ప్రజాశక్తి- పమిడిముక్కల** : పమిడిముక్కల మండలం లోని ముళ్ళపూడి, కృష్ణాపురం శివారు నారాయణపురం అంగ న్వాడి కేంద్రాల్లో అంగన్వాడికి తెలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. అంగన్వాడి సూపర్వైజర్ ఉషా మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన విద్యా విధానం అంగన్వాడీలో ఉంటుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సౌకర్యాలు వినియోగిం చుకోవాలని కోరారు. అంగన్వాడి సూపర్వైజర్ సలీం మున్నిసా, ప్రేమలత, వీర కుమారి పాల్గొన్నారు.

పమిడిముక్కల మండలంలో..

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి వార్పు వద్ద జల వనరుల శాఖ కింద మంజూరైన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఆపరేషన్, మెయింటెనెన్స్ నిధులతో 93 పనులకు మంజూరైన మూడుకోట్ల 20 లక్షలు అలాగే రాష్ట్ర డిజాస్టర్ మిటిగేషన్ నిధులతో 18 పనులకు 5.632 కోట్లతో పూర్తయిన అభివద్ధి పనులను బుద్ధప్రసాద్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మోపిదేవి మండలంలోని కే కొత్తపాలెం ఎస్సీ కాలనీలో ఒక కోటి 24 లక్షల పదివేల రూపాయల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన 15 సిమెంటు రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఇరిగేషన్ రంగానికి పునరుత్తేజం కల్పిస్తా మని అన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ నియోజక వర్గ ప్రత్యేక అభివద్ధి అధికారి సాయిబాబు, యువనేత మండలి వెంకట్రాం, ఇరిగేషన్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఘంటసాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ తోట కనకదుర్గ పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మొవ్వ : పామర్రు నియోజకవర్గంలోని మొవ్వ నుంచి పెదముత్తేవి మీదుగా అవనిగడ్డ నియోజకవర్గం లోని ఘంటసాల ఆర్ అండ్ బి రహదారి పనులకు పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా బుధవారం భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. అలాగే స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్(ఎస్ డి ఎంఎఫ్) నిధులతో మిషన్ పాట్ హెూల్ ఫ్రీ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి డిఈ తాతాసంగీత, ఏఈ సురేష్, మండల తెలుగుదేశం అధ్యక్షుడు లింగమనేని రామలింగేశ్వర రావు, నాయకులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం) : హనుమాన్‌జంక్షన్ లో హనుమాన్ జంక్షన్ ఎస్సై సురేష్ వాహనాలు తనిఖీలు బుధవారం నిర్వహించారు. విజయవాడ రోడ్డు, నూజివీడు రోడ్డు, గుడివాడ రోడ్డు ల్లో ఆటో డ్రైవర్లు రోడ్డుకు అడ్డంగా ఆటోలో నిలిపి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆటో పత్రాలను, డ్రైవింగ్ లైసెన్స్ లను తనిఖీ చేసి జరిమానాలు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు రోడ్డుకు అడ్డంగా ఆటోలను నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుని ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్నారని దానివలన ట్రాఫిక్ నిలిచిపోతుందని అన్నారు. ఆటో డ్రైవర్లు వారికి ఒక స్థలం కేటాయింపు చేసుకొని అక్కడ మాత్రమే ఆటోలు నిలపాలన్నారు. అదేవిధంగా ఆటో కి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

14న ఆపరేషన్ బుడమేరు ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గుడివాడ : ఆపరేషన్ బుడమేరును అమలు చేయాలని, ముంపునకు శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 14న విజయవాడ ధర్నాచౌక్‌లో చేపట్టే నిరసనకు బుడమేరు పరివాహక ప్రాంతాల రైతులు, గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ గుడివాడ నియోజవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని సిపిఐ సెంటర్‌లోని కార్యాలయంలో సిపిఐ సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, సభ్యులు డి.రామకృష్ణలతో కలసి నియోజవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు మాట్లాడారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : పెడన మండల ంలో ఉన్న సెయింట్ విన్సెంట్ పల్లోటి విద్యా సంస్థలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న వారిని అడ్డుకొని మండల విద్యాశాఖ అధికారి హరనాథ్‌ను పిలిపించి పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేయించామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లోటి ప్రైవేట్ విద్యాసంస్థలో పుస్తకాల పేరుతో, యూనిఫామ్ పేరుతో, విద్యార్థుల తల్లి దండ్రుల నుంచి వేలకు వేలు రూపాయలను వసూలు చేస్తున్న విద్యాసంస్థ పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, గుర్తింపు రద్దు చేయాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేసారు. పెడన మండలం లోనే కాకుండా జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విచ్చలవిడిగా విద్యా హక్కుల చట్టానికి విరుద్ధంగా విద్యాసంస్థలో పుస్తకాల అమ్మకాలను నిర్వహిస్తున్న వాటిని గుర్తించి వాటి గుర్తింపు రద్దు చేయాలని కోరారు. పల్లోటి స్కూల్ యాజమాన్యం ఎస్ఎఫ్ఐ నాయకులపై దౌర్జన్యం చేసి ఫోన్లు లాక్కున్నారని, దుర్భాషలాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు అమీర్ మరియు నాయకులు పాల్గొన్నారు.

సర్వే చేస్తున్న సిపిఎం నాయకులు

ఇళ్లు తొలగించాలని నోటీసులివ్వడం దారుణం : సిపిఎం

ప్రజాశక్తి-కంకిపాడు : కానూరు, గుమ్మడి తోట, పంట కాలువ పక్కన ఇల్లు నివాసాలు ఏర్పాటు చేసుకొని 40 ఏళ్లగా నివాసాలు ఉంటున్నవారి ఇల్లు తొలగించాలని నోటీసులు ఇవ్వడం అన్యాయమని సిపిఎం పెనమలూరు మండల కార్యదర్శి ఖాసీం అన్నారు. సిపిఎం పెనమలూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నోటీసులు ఇచ్చిన ప్రాంతాల్లో సర్వే చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గనక వెళ్లి ఇళ్లు తీయాలని చూస్తే వాళ్లకు ప్రత్యాన్యాయంగా స్థలాలు ఇచ్చి, ఇల్లు కట్టించి అప్పుడు తొలగించాలని అన్నారు. వారికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని అన్నారు. ఈ సర్వేలో ఉప్పాడ త్రిమూర్తులు, మాదు నాగేశ్వరావు, రత్నకరణ, షేక్ మస్తాన్వలి, స్థానికులు పాల్గొన్నారు

పల్లా సింహాచలం చిరస్మరణీయుడు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : పల్లా సింహాచలం చిరస్మరణీయుడని, బడుగు బలహీన వర్గాలకు అండదండగా ఉండేవారని, ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని మండల టిడిపి అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్ తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తండ్రి, మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం చిత్రపటానికి పూలమాలవేసి నివాళుల ర్పించా రని తెలిపారు. విశాఖ సీతంపేటలోని పల్లా శ్రీనివాసరావు నివా సా నికి వెళ్లి ఆయనతో కలసి సింహాచలం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : ఎంఎల్ఎ

పామర్రులో సిసి రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వర్ల

ప్రజాశక్తి - పామర్రు : మండలపరిధిలోని పెదమద్దాలిలో నిర్మాణం పూర్తి చేసుకున్న రోడ్లను ఎమ్మెల్యేవర్ల కుమార్ రాజా గురు వారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదమద్దాల గ్రామంలో 50 లక్షలు నిధులతో 13 రోడ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. రాబోవు రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని అభివద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం పామర్రు గాంధీనగర్ లోని సిసి రోడ్డును కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ వల్లూరుపల్లి గణేష్, మాజీ వైస్ ఎంపీపీ నాజరస్, పంచాయతీ సభ్యుడు మంతెన రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో భారీ వర్షం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో మంగళవారం అర్ధరాత్రి నుండి బుధవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. 45.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గత నాలుగు రోజుల నుండి ఎండలు తీవ్రత అధికంగా ఉండటంతో పాటు వడగాలులు ఒక్కపాతతో ప్రజలు అల్లాడిపోయారు. మరో రెండు రోజులపాటు ఎండల తీవ్రత అధికంగా ఉండవచ్చు నని వాతావరణ శాఖ కూడా హెచ్చరించినప్పటికీ ఒక్కసారిగా వాతావరణం మారి భారీ వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. దీనితో ప్రజలు ఎండల నుండి ఉపశమనం పొందినట్లు అయింది కాగా రైతులు మరోవైపు ఖరీఫ్ పనులకు సిద్ధమవుతున్నారు.

సమీక్షలో పాల్గొన్న ఎంపి చిన్ని, ఎంఎల్ఎ వసంత

స్వర్ణాంధ్ర విజన్ - 2047పై ఎంపి సమీక్ష

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మైలవరం నియోజక వర్గ అభివృద్ధిపై డాక్యు మెంటేషన్ సిఎం చంద్రబాబుకి అంద జేస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ -2047 లో భాగంగా మైలవరం నియోజక వర్గ అభివృద్ధికి సంబంధించి తయారైన డాక్యుమెం టేషన్‌పై గొల్లపూడిలోని సాయిదత్తా కళ్యాణ మండపంలో బుధవారం మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ఆధ్వర్యంలో పలు విభాగాల ప్రభుత్వాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపి మాట్లాడుతూ జిల్లాలో హార్టికల్చర్ మైలవరం నియోజకవర్గంలోనే ఉందన్నారు. భవానీపురం పవిత్ర సంగమం దగ్గర టూరిజం శాఖ వారు జలహారతి కార్యక్రమానికి మొదలుపెట్టేలా కోరారు. వరదలను తట్టుకునే విధంగా టూరిజం ప్రోగ్రామ్ ఏర్పాటు చేసి బోటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. త్వరలో కొండపల్లి రైల్వే స్టేషన్ కూడా శాటిలైట్ స్టేషన్ కింద అభి వృద్ధి జరిగేలా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మైల వరం నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ అక్కల రామ్మోహన రావు (గాంధీ), మైలవరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ నూ తల పాటి బాలకోటేశ్వరరావు (బాల), సివిల్ సప్లై డి.ఎమ్, విజన్ 2047 నోడల్ ఆఫీసర్ సతీష్, మైలవరం ఎమ్.డి.వో. విజన్ 2047 కో-ఆర్డినేటర్ అనురాధ పాల్గొన్నారు.

తనైరాలో ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : టాటా ఉత్పత్తి, తనైరా షోరూమ్‌లో చీరలపై ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామని సంస్థ మార్కెటింగ్ హెడ్ ఐశ్వర్య ఓమ్ ప్రకాష్ తెలిపారు. ఎం.జీ రోడ్డులోని తనైరా షోరూంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ విజయవాడలోని తమ షోరూమ్‌లో తొలిసారిగా చీరలపై 40 శాతం తగ్గింపును అందిస్తున్నా మన్నారు. తమ షోరూంలోని బెనారస్, కాంజీవరం, జమానా చీరలపై ఈ ఆఫర్లు అందిస్తున్నామన్నారు. వివాహాది, శుభకార్యాల సందర్భంగా ఈ ఆఫర్లు అందిస్తున్నామన్నారు. ప్యూర్ సిల్క్, కాటన్, ఇ-కట్, కోటా, డోరిస్, చందర్, సౌత్ సిల్క్, వంటి వాటిపై కూడా ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఒకేషనల్ విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక వేములూరి వెంకటరత్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ కోర్సును అభ్యసించిన విద్యార్థి రాష్ట్ర ప్రభుత్వం నుండి బంగారు పథకం అందుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ సరళ కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.తమ కళాశాలకు చెందిన బాణావతు భావన 1000 మార్కులకు గానూ 953 మార్కులు సాధించి ఎస్‌టి విభాగంలో బంగారు పథకంతో పాటు ప్రశంసా పత్రం 20 వేల నగదు బహుమతిని అందుకుందన్నారు. ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. భావనను ఒకేషనల్ అధ్యాపకులు పసుపులేటి రాధాకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు అభినందించారు.

పలుచోట్ల ఏరువాక పౌర్ణమి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : జిల్లాలో తొలకరిలో తొలిగా దుక్కికి శ్రీకారం చుట్టే ఎంతో ముఖ్యమైన ఏరువాక పౌర్ణమి పండుగను జిల్లా కలెక్టరు డాక్టర్ జి.లక్ష్మీశ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలో అన్నదాతల మధ్య ఎంతో ఉత్సాహంగా, సాంప్రదాయ బద్ధంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు ఎప్పటి కప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పొందటంతో పాటు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చు అని సూచించారు. వ్యవసాయంలో డ్రోన్ల అవసరాన్ని, ఉపయోగాలను సవివరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మైసమ్మ తల్లి ఆగ్రోఫామ్, జక్కంపూడి మరియు అమరావతి కిసాన్ డ్రోన్ గ్రూపు, రాయనపాడు సభ్యులకు కలెక్టరు గారి చేతుల మీదుగా 80శాతం రాయితీపై డ్రోన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి డి.యమ్.ఎఫ్ విజయ కుమారి, మాట్లాడుతూ రాబోవు ఖరీఫ్ సీజనుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి పి.యమ్. సుబానీ, మైలవరం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎమ్.శ్రీనివాసరావు, విజయవాడ వ్యవసాయ సహాయ సంచాలకులు బొడ్డపాటి వెంకటేశ్వరరావు, ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ అధికారి డి.శైలజ ఇతర వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, టిడిపి మండల పార్టీ ప్రెసిడెంట్ రామినేని రాజా, జూపూడి గ్రామ సర్పంచ్ కాకి దేవమాత, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు మండలం కాకర్ల గ్రామంలో ఏరువాక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ నియోజకవర్గంలో పాడి పంటలతో, సిరిసంపదలతో రైతులంతా వ్యవసాయంలో అభివృద్ధి సాధించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు పి .పద్మ, షేక్. టిప్పు సుల్తాన్, వ్యవ సాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.
నందిగామ : ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య చందర్లపాడు, నందిగామ మండలం మునగచర్ల గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొని దుక్కి దున్నారు.

బిఎస్‌సి నర్సింగ్ అడ్మిషన్లకు ఎపిఎన్ సెట్

20 వరకు దరఖాస్తులు స్వీకరణ - ఎన్టీఆర్ వైద్య విశ్వ విద్యాలయం విసి డాక్టర్ చంద్ర శేఖర్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రపంచవ్యాప్తంగా నర్సింగ్‌కు మంచి ఉపాధి అవకాశాలు, ఆదరణ ఉన్నాయని నర్సింగ్ కోర్సు చేసేవారికి ఇదొక మంచి అవకాశమని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఆవరణలో ఉదయం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ నేను 12వ వైస్ ఛాన్సలర్‌గా డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజాన విశ్వ విద్యాలయానికి వచ్చానన్నారు. బిఎస్‌సి నర్సింగ్ కోర్సులో అడ్మిషన్లకు ప్రత్యేక ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించాలని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ తెలిపిందన్నారు. అందుకు అనుగుణంగా మే 27, 2025న నోటిపికేషన్ విడుదల చేశామన్నారు. 6 జూలై 2025 ఎపిఎన్ సెట్ - 2025 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. బిఎస్‌సి నర్సింగ్ కోర్సులో 2025-26 సంవత్సరం ప్రవేశాలకు గానూ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజాన విశ్వ విద్యాలయం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. దరఖాస్తులను 5 మే నుండి జూన్ 20 వరకు స్వీకరిస్తున్నామన్నారు. చివరి రోజు 20న ఆన్‌లైన్ దరఖాస్తులను సాయంత్రం 6 గంటల వరకు స్వీకరిస్తామన్నారు. గతంలో ఇఎపిఎం సెట్ ఫలితాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరిగేదన్నారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికా రెడ్డి మాట్లాడుతూ నర్సింగ్‌కు ప్రత్యేక ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నర్సింగ్ సెట్‌లో 100 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇంగ్లీషు, నర్సింగ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులుగా ఎంట్రన్స్ పరీక్ష ఉంటుందన్నారు. ఇతర రాష్ట్రాల వారు కూడా దరఖాస్తు చేస్తారు కనుక 15 వేల వరకు అప్లికేషన్స్ వస్తాయన్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సీహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ నర్సింగ్ పరీక్ష 100 మార్కులకు తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ఉంటుందని ఏ భాషలో అయినా రాయొచ్చన్నారు. కంప్యూటర్ అలవాటు లేనివారికి వారం రోజుల పాటు మాక్ టెస్ట్స్ నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ http://drntr.uhsap.in/ను సంప్రదించి, దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్

ఇంద్రకీలాద్రిపై గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థాన గిరి ప్రదక్షిణ మహోత్సవం బుధవారం నయన మనోహరంగా సాగింది. వివిధ పుష్పాలతో అలంకరించిన ప్రత్యేక వాహనంపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. అనంతరం టెంపుల్ ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద కామధేను సన్నిధి నుండి దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె.శీనానాయక్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఘాట్ రోడ్ నుండి బయలుదేరిన గిరి ప్రదక్షిణ కుమ్మరి పాలెం, విద్యాధరపురం, కబేళా మీదుగా పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్త పేట బ్రాహ్మణ వీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ సాగింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ కళా బృందాల ప్రదర్శనలు నిర్వహించారు. వేద పండితులు దేవస్థాన సిబ్బంది, యాత్రికులు గిరి ప్రజదక్షణలో పాల్గొన్నారు.

కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో బలుసుపాడు రోడ్డులో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పిఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ (ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఆఫ్ ఇండియా) ఫండ్స్ రూ.24 లక్షలతో ప్లే గ్రౌండ్ అభివృద్ధి పరిచేందుకు, నూతనంగా నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్‌ను ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుజాత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - విజయవాడ : సెంట్రల్ నియోజకవర్గంలోని 26వ డివిజన్ అల్లూరి సీతారామరాజు వంతెన వద్ద పైపులైనుకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని స్థానిక కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరితో కలిసి ప్రారంభించారు. 28వ డివిజన్ భానునగర్ మసీదు ఎదురు పునూరు సుబ్బరామి రెడ్డి నగర్‌లో డ్రైన్, వాటర్ లైన్, రోడ్ పనులకు శంకుస్థాపన చేశారు. 29వ డివిజన్ మధురానగర్ జాన్ టీ స్టాల్ దగ్గర సర్వీస్ రోడ్డు శంకుస్థాపన, 30వ డివిజన్ దేవి నగర్ 8వ రోడ్డు బస్టాప్ వద్ద, వినాయక నగర్ రెండో రోడ్డు పనులకు శంకుస్థాపన, 1వ డివిజన్ గుణదల రైల్వే గేటు దగ్గరలో గల మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీలో నూతన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. **విస్సన్నపేట :** మండలం తెల్లదేవరపల్లి గ్రామం ఎస్‌సి ఏరియాలో సిసి రోడ్ల నిర్మాణానికి తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్లకు అంచనా విలువ రూ.32.10 లక్షలు అనిపొడవు 471.50 మీటర్లని ఈ గ్రాంట్ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం నిధుల నుండి మంజూరు చేసినట్లు తెలిపారు. **గంపలగూడెం :** మండలంలోని పెద్దకొమెర గ్రామంలో ఇటీవల నిర్వహించిన సిసి రోడ్డు తిరువూరు ఎంఎల్ఎ కె.శ్రీనివాస్ ప్రారంభించారు. ఉపాధి హామీ నిధుల నుండి మంజూరైన 75 లక్షలతో ఈ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేముల కస్తూరి, ఎంపీటీసీ సభ్యుడు డి.బుచ్చిరామయ్య, పంచాయతీరాజ్ డిఇ లక్ష్మణరావు, ఎంపీడీవో టీవీఎస్ నాగేశ్వరరావు, ఏఈ రేగళ్ల పూర్ణచంద్రరావు, పాల్గొన్నారు. **విజయవాడ సిటీ :** స్థానిక 44వ డివిజన్‌లోని యద్దనపూడి వారి వీధి, భారత్ గ్యాస్ కంపెనీ వీధిలో మూడు రోడ్లను సిసి రోడ్లుగా నిర్మించేందుకు రూ.15 లక్షల రూపాయల విలువైన పనులను ప్రారంభించినట్లు 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి చెప్పారు. బుధవారం మూడు రోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ రత్నకుమారి ప్రారంభించారు. టిడిపి సీనియర్ నాయకులు మైలవరపు దుర్గారావు స్థానికులు నరహరిశెట్టి నరసయ్య, శ్రీనివాస్, రెడ్డి, పాల్గొన్నారు. తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్‌తో కలిసి టిడిపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి) బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డివిజన్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు తాగునీటి సమస్య తలెత్తకుండా నూతన పైప్‌లైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఇక భవానీపురం ప్రగతి న్యూ హెచ్.ఐ.జి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో రూ.29.50 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ప్రత్తిపాటి శ్రీధర్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యత, ప్రమాణాలు పాటించి పనులను సకాలంలో పూర్తిచేయాలని ఎంఎల్ఏ సుజనా ఆదేశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇ.ఇ.సురేఖ, డి.ఇ కరుణాకర్, ఎ.ఇ.రామకృష్ణ, డి.ఇ పురుషోత్తం, ఎ.ఇ.రామకృష్ణ, పాల్గొన్నారు. **నందిగామ :** గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సిఎం చంద్రబాబు నాయుడు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. **ఇబ్రహీంపట్నం :** రాయనపాడు గ్రామంలో రూ.4.40 కోట్లతో నిర్మించిన పంచాయతీ రాజ్ బి.టి.రోడ్డును, రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులు, రూ.16 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ సెంటరు అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే కృష్ణ ప్రసాదు బుధవారం ప్రారంభించారు. రాయనపాడు గ్రామాభివద్ధికి మరో రూ.1.20 కోట్లు మంజూరు చేశామని ఎంఎల్ఏ తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.